@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

గురువారం
19 నవంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :136
పేజీలు : 12 వెల : 5/-

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE







కృష్ణా జలాలపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

- తెలంగాణ నీటి వాటాలో చుక్క నీటిని కూడా వదులుకోం
- బీఆర్ఎస్ హయాంలో ఏపీకి అధికంగా కృష్ణా జలాల వినియోగం
- కాంగ్రెస్ వచ్చాక తెలంగాణకే ఎక్కువ నీటి వినియోగం

హైదరాబాద్

తెలంగాణ నదీ జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను ఏమాత్రం వదులుకునే ప్రసక్తే లేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. కృష్ణా జలాల వినియోగంపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే ఆంధ్రప్రదేశ్ తెలంగాణ కంటే ఎక్కువగా కృష్ణా జలాలను వినియోగించుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి మారిందని, ఏపీ కంటే తెలంగాణే అధికంగా - మిగతా 12లో

అర్హ కుటుంబాలన్నింటికీ బీమా భద్రత

- ఇందిరమ్మ బీమాకు ప్రత్యేక నమోదు కేంద్రాలు
- ప్రతి అర్హ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా..
- ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ ద్వారా నమోదు
- నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ..
- గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక కేంద్రాలు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. రాష్ట్రంలోని అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందుకోసం ప్రత్యేక యాప్‌తో పాటు ఆన్‌లైన్ నమోదు సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో సీఎస్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పథకం - మిగతా 12లో



సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు.. న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

- న్యాయవ్యవస్థపై ఆరోపణల నేపథ్యంలో చర్యలు
- వివరణ ఇవ్వాలని ఆదేశం.. 2027 జనవరి 20కు తదుపరి విచారణ



భారత్ వ్యతిరేక ప్రచారానికి రాహుల్‌గాంధీ నాయకత్వం

- కొలంబియా యూనివర్సిటీలో దేశ ఆర్థిక వ్యవస్థపై వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- విదేశాలకు వెళ్లినప్పుడల్లా తప్పుడు వ్యాఖ్యలు

ఓటరు నమోదుకు మరో అవకాశం

- డిసెంబర్ 22కు తుది జాబితా
- ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను మరోసారి సవరించిన ఎన్నికల సంఘం
- డిసెంబర్ 15 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారం



హైదరాబాద్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. తెలంగాణ సహా ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను మరోసారి సవరించింది. గతంలో నవంబర్ 30గా నిర్ణయించిన తుది ఓటరు జాబితా ప్రచురణ తేదీని డిసెంబర్ 22కు మార్చింది. నోటీసుల జారీ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 15 వరకు గడువు ఇచ్చింది. ఎన్నికల సంఘం నవంబర్ 17న జారీ చేసిన తాజా షెడ్యూల్ ప్రకారం.. తెలంగాణలో నోటీసుల ప్రక్రియ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం డిసెంబర్ 15 వరకు కొనసాగనున్నాయి. తుది ఓటరు జాబితాను డిసెంబర్ 22న ప్రచురించనున్నారు. గతంలో ఈ ప్రక్రియ నవంబర్ 26తో ముగియాల్సి ఉండగా, తుది జాబితా నవంబర్ 30న విడుదల చేయాలని నిర్ణయించారు. తాజా నిర్ణయంతో మరోసారి గడువు మారింది. ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని - మిగతా 12లో

ఆయుష్మాన్ భారత్‌లో భారీ మార్పులు!

- 23 నుంచి 112కు పెరగనున్న ప్యాకేజీలు
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మరిన్ని చికిత్సలు
- 89 కొత్త వైద్య సేవలకు ప్రతిపాదన
- చిన్నచిన్న వ్యాధులకు స్థానికంగానే వైద్యం
- హిస్టరెక్టమీ నుంచి గ్లకోమా వరకు చికిత్సలు
- ఆస్పత్రుల అభివృద్ధికి అదనపు నిధులు





మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

- మసీదులో దాక్కున్నా వదలని భద్రతా బలగాలు..
- లొంగిపోవాలని కోరినా నిరాకరణ
- రూ.15 లక్షల రివార్డు ప్రకటించిన ఉగ్రవాది కథకు తెర..
- ఆపరేషన్‌ను అభినందించిన అమిత్ షా

ఏపీలో లేని క్రాప్ హాలిడే తెలంగాణకు ఎందుకు?

- 90 టీఎంసీల నీటి తరలింపుపై అభ్యంతరం
- 510 అడుగుల దిగువ నుంచి నీటి సేకరణపై ప్రశ్నలు
- రేవంత్, ఉత్తమ్ సమాధానం చెప్పాలి
- పాలమూరు ప్రాజెక్టులపై కాంగ్రెస్ నిర్లక్ష్యం
- కృష్ణా జలాల కోసం బీఆర్ఎస్ న్యాయపోరాటం
- నీటి హక్కుల కోసం ప్రజా ఉద్యమానికి సిద్ధం



హైదరాబాద్

తెలంగాణ నీటి హక్కులు, పాలమూరు జిల్లాలో నెలకొన్న కరవు పరిస్థితులు, నాగార్జునసాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా జలాల తరలింపు అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల - మిగతా 12లో

మోదీ పాలనలో సామాన్యుడి కంచం చిన్నదైంది!



- ధరల పెరుగుదలపై కేంద్రంపై ఖర్గే ఫైర్
- కనీస అవసరాలకూ కష్టమే
- నిత్యావసరాల ధరలకు రెక్కలు
- దేశ పురోగతికి కొలమానం ప్రసంగాలు కాదు
- ధరల నియంత్రణపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- భారీగా పెరిగిన టోకు ద్రవ్యోల్బణం
- ఇంధనం, ఆహార ధరల ప్రభావం

భారత్-జపాన్ బంధానికి ఇదే సరైన సమయం!

- ప్రపంచ పరిణామాలతో మారుతున్న అంతర్జాతీయ వ్యవస్థ
- కొవిడ్, యుద్ధాలతో సరఫరా వ్యవస్థలకు సవాళ్లు
- తక్కువ ఖర్చు కంటే విశ్వసనీయతకే పెద్దపీట
- జపాన్ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యం
- సెమీకండక్టర్లు, కీలక ఖనిజాల్లో భాగస్వామ్యం



సంపాదకీయం

దడ పుట్టిస్తున్న ద్రవ్యోల్బణం

ధరల కట్టడిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం కావడంతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయి. దేశంలో టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) మరోసారి పెరిగింది.అక్టోబరులో వార్షిక ప్రాతిపదికన టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల్లో ఈ విషయం వెల్లడైంది.సెప్టెంబరులో నమోదైన 11.39 శాతంతో పోలిస్తే అక్టోబరులో ద్రవ్యోల్బణం మరింత పెరిగింది. సర్వేలో ఆర్థిక నిపుణులు అంచనా వేసిన 12.1 శాతాన్ని కూడా మించింది. ప్రధానంగా ఆహార పదార్థాలు, చమురు ధరలు పెరగడం ఈ పరిణామానికి కారణమైంది. అక్టోబరులో టోకు ఆహార ధరలు 8.58 శాతం పెరిగాయి.అయితే సెప్టెంబరులో ఈ పెరుగుదల 8.66 శాతంగా నమోదైంది. అంటే ఆహార ధరల పెరుగుదల రేటులో స్వల్ప తగ్గుదల కనిపించింది.మరోవైపు తయారీ రంగ ఉత్పత్తుల ధరలు అక్టోబరులో 9.54 శాతం పెరిగాయి.సెప్టెంబరులో ఈ పెరుగుదల 9.76 శాతంగా ఉంది. దీంతో తయారీ ఉత్పత్తుల ధరల పెరుగుదలలోనూ కొంత తగ్గుదల నమోదైంది.ఇంధనం, విద్యుత్ ధరల పెరుగుదల మాత్రం మరింత వేగంగా కొనసాగింది.సెప్టెంబరులో 25.85 శాతంగా ఉన్న ఈ విభాగం ద్రవ్యోల్బణం అక్టోబరులో 32.84 శాతానికి చేరింది.అయితే పెట్రోలియం, సహజ వాయువు ధరల పెరుగుదల మాత్రం గణనీయంగా తగ్గింది.సెప్టెంబరులో 57.32 శాతంగా ఉన్న ఈ ధరల పెరుగుదల అక్టోబరులో 7.80 శాతానికి పరిమితమైంది.మొత్తంగా ఆహార పదార్థాలు, ఇంధనం, చమురు ధరల్లో చోటుచేసుకున్న మార్పులు టోకు ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపాయి.జాతీయ గణాంక కార్యాలయం విడుదల చేసిన వినియోగదారుల ధరల సూచీ గణాంకాల ప్రకారం, దేశంలో 7 శాతానికి మించి ద్రవ్యోల్బణం నమోదైన ఆరు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉంది. గత పది నెలలుగా రాష్ట్రంలో ద్రవ్యోల్బణం జాతీయ సగటు కంటే ఎక్కువగా కొనసాగుతోంది. ఇది సామాన్య కుటుంబాల కొనుగోలు శక్తిపై ఒత్తిడి తెస్తోంది.ఈ ఏడాది జనవరిలో తెలంగాణలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.92 శాతంగా ఉండగా, నెలవారీగా పెరుగుతూ అక్టోబర్‌లో 7.26 శాతానికి చేరుకుంది.ఫిబ్రవరిలో 5.02, మార్చిలో 5.83, మేలో 6.15, జూన్‌లో 6.36 శాతంగా నమోదైంది. జూలై, ఆగస్టులో కాస్త తగ్గినప్పటికీ సెప్టెంబర్ నుంచి మళ్లీ పెరుగుదల మొదలైంది. ఇప్పుడు ఏడాది గరిష్ఠ స్థాయికి చేరింది.గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అక్టోబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం 8.05 శాతానికి చేరగా, పట్టణ ప్రాంతాల్లో 6.68 శాతంగా ఉంది. జాతీయ గ్రామీణ సగటు 6.63 శాతంతో పోలిస్తే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 1.4 శాతం పాయింట్లు అధికం.దీంతో గ్రామీణ కుటుంబాలపై నిత్యావసరాల ధరల భారం మరింత ఎక్కువగా పడుతోంది.ఆహార ధరల పెరుగుదలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో ఆహార ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 7.74 శాతం ఉండగా అక్టోబర్‌లో 8.94 శాతానికి పెరిగింది. ఉల్లి ధరలు 116 శాతం పైగా పెరగడం, వెల్లుల్లి, అల్లం, నిమ్మకాయలు, బియ్యం వంటి వస్తువుల ధరలు ఎగబాకడం సామాన్యుల ఇంటి బడ్జెట్‌పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.అక్టోబర్‌లో రాష్ట్రంలో వర్షపాతం భారీగా తగ్గడం, ఎల్‌నినో ప్రభావం వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది కూరగాయలు, పండ్లు, ధాన్యాల ధరలపై మరింత ఒత్తిడి తీసుకురావచ్చు.ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి, నిమ్న మధ్యతరగతి కుటుంబాలు రోజువారీ ఖర్చులను తగ్గించుకోవాల్సి వస్తోంది. కూరగాయలు, పప్పులు, నూనె, పాలు వంటి అవసరాలకు ఎక్కువ ఖర్చు పెట్టాల్సి రావడంతో ఇతర అవసరాలు వెనక్కి పోతున్నాయి.ప్రభుత్వం ధరల నియంత్రణకు చర్యలు చేపట్టినప్పటికీ, సరఫరా గొలుసులోని సమస్యలు, వాతావరణ ప్రభావం కొనసాగితే ముందున్న నెలల్లో కూడా ఒత్తిడి ఉండే అవకాశం ఉంది.మొత్తంగా చూస్తే తెలంగాణలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి రావాలంటే ఆహార ఉత్పత్తి పెంపు, సరఫరా మెరుగుదల, అవసరమైన చోట సబ్సిడీలు లేదా మార్కెట్ జోక్యం అవసరం. సామాన్యులు కూడా ధరలు తక్కువగా ఉన్న సీజనల్ కూరగాయలు, స్థానిక ఉత్పత్తులు వాడటం ద్వారా కొంతవరకు ఖర్చులను అదుపులో ఉంచుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితి సామాన్యుడి జేబుపై నిజంగా భారం పెడుతోంది.ద్రవ్యోల్బణం కట్టడికి వచ్చే ద్రవ్య సమీక్షల్లో రెపోరేటును ఆర్బీఐ పెంచడం ఖాయంగానే కనిపిస్తున్నది. ఇదే జరిగితే నిర్మాణ, ఆటో రంగాలకు పెద్ద దెబ్బేనన్న విశ్లేషణలుంటున్నాయి. ఇప్పటికే ఇండ్ల విక్రయాలు లేక రియల్ ఎస్టేట్ రంగం కుదేలైంది. ఈ క్రమంలో వడ్డీరేట్ల పెంపు గృహ రుణాలపై ప్రభావం చూపనున్నది. ఇప్పటికే లోన్లపై ఇండ్లు కొన్నవారికి ఈఎంఐలు భారంగా మారుతాయని, కొనాలనుకుంటున్నవారు తమ నిర్ణయాలను వాయిదా వేసుకోవచ్చని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అలాగే వాహన, వ్యక్తిగత రుణాలూ ప్రియమవుతాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణ, ఆటో వాటి అనుబంధ రంగాలు మందగమనంలోకి జారుకుంటే.. అది దేశ ఆర్థిక వృద్ధిరేటునే కుంగదీస్తుందని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలే ఎల్ నినో దెబ్బకు అన్ని రంగాలు ఢీలాపడ్డ తరుణంలో ద్రవ్యోల్బణం పేరిట ఆర్బీఐ వడ్డీరేట్లను పెంచితే మరిన్ని రంగాలు నష్టపోతాయని సూచిస్తున్నారు.ఇంధనం, ఆహార ధరల షాక్‌లు రెండూ ఒకేసారి వచ్చినప్పుడు వాటి ప్రభావం మరింత పెద్దదిగా ఉండవచ్చు. అందుకే పరిస్థితుల్ని చక్కదిద్దడానికి ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు అనివార్యంగానే కనిపిస్తున్నది. వచ్చే నెల ద్రవ్య సమీక్షలో రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలు లేకపోలేదు.ఎల్ నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో దేశీయ వ్యవసాయ రంగం దెబ్బ తింటున్నది. పంటల సాగు, దిగుబడి రెండూ పడిపోతున్నాయి. ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉండటంతో వినియోగ సామర్థ్యం తగ్గిపోతున్నది. పెరుగుతున్న వడ్డీరేట్లతో రుణ లభ్యత ఖరీదెక్కుతున్నది.

తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరి వార్



చెన్నై : కర్ణాటకలోని కావేరీ నదిపై మేకదాటు దగ్గర భారీ జలాశయం నిర్మించాలని అక్కడి ప్రభుత్వం ప్రతిపాదించింది. బెంగళూరుతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలు తీర్చడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. నీటిని నిల్వ చేయడంతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేయాలని కర్ణాటక భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 67 టీఎంసీల నీటిని నిల్వ చేయాలని ప్రతిపాదించింది. తాగునీటి అవసరాలకు 4.75 టీఎంసీలు వినియోగించాలని ప్రణాళికలో పేర్కొంది. సుమారు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కూడా లక్ష్యంగా పెట్టుకుంది. అయితే తమిళనాడు ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. జలాశయం నిర్మిస్తే తమకు వచ్చే కావేరీ నీటి ప్రవాహంపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా డెల్టా ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు దెబ్బతింటాయని వాదిస్తోంది. కర్ణాటకకు నీటి నిల్వ అవసరం. తమిళనాడుకు నీటి ప్రవాహంపై భరోసా కావాలి. ఈ రెండు వాదనల మధ్యే మేకదాటు వివాదం కొనసాగుతోంది.కావేరీ నదిపై ఎగువ ప్రాంతంలో కర్ణాటక జలాశయం నిర్మిస్తే నీటి నిల్వ, విడుదలపై ఆ రాష్ట్రానికి మరింత నియంత్రణ లభిస్తుందని తమిళనాడు భావిస్తోంది. దీనివల్ల తమకు కేటాయించిన నీటి వాటా అందడంలో ఇబ్బందులు తలెత్తవచ్చని వాదిస్తోంది. కావేరీ డెల్టాలో వరి సాగు ఎక్కువగా జరుగుతుంది. ఈ ప్రాంత రైతులు నదీ జలాలపైనే ఆధారపడుతున్నారు. నీటి విడుదలలో ఆలస్యం జరిగినా పంటలపై ప్రభావం పడుతుంది. అందుకే మేకదాటు నిర్మాణానికి అనుమతులు ఇవ్వొద్దని తమిళనాడు పట్టుబడుతోంది.మరోవైపు కర్ణాటక తన ప్రతిపాదనను సమర్థిస్తోంది. బెంగళూరు నగరం వేగంగా విస్తరిస్తుండటంతో తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయని చెబుతోంది. భవిష్యత్తులో నీటి కొరత రాకుండా జలాశయం ఉపయోగపడుతుందని వివరిస్తోంది. వర్షాకాలంలో వచ్చే నీటిని నిల్వ చేసుకోవచ్చని అంటోంది. తమిళనాడుకు కేటాయించిన 177.25 టీఎంసీల నీటిని విడుదల చేసే బాధ్యతను తాము పాటిస్తామని చెబుతోంది. జలాశయం వల్ల తమిళనాడుకు కూడా ప్రయోజనం ఉంటుందని కర్ణాటక వాదిస్తోంది. అయితే ఈ వాదనలను తమిళనాడు అంగీకరించడం లేదు. నీటి వాటా కేటాయింపులు ఉన్నప్పటికీ.. అదనపు జలాశయం వల్ల భవిష్యత్తులో తమకు ఇబ్బందులు రావచ్చని ఆందోళన చెందుతోంది.మేకదాటు విషయంలో తమిళనాడు అభ్యంతరాలు కొనసాగుతున్న సమయంలో విజయ్ కర్ణాటక సీఎంతో ఒకే వేదికపై కనిపించడం వివాదానికి కారణమైంది. సోనియా గాంధీ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఇద్దరూ కలుసుకున్నారు. ఈ భేటీలో కావేరీ జలాల అంశాన్ని విజయ్ ప్రస్తావించారా లేదా అన్నది కూడా చర్చకు వచ్చింది. రాష్ట్ర హక్కుల కోసం పోరాడాల్సిన సమయంలో రాజకీయ మర్యాదలకే ప్రాధాన్యం ఇచ్చారని ప్రతిపక్షాలు విమర్శించాయి.

విజయ్ ఢిల్లీ పర్యటనపై బీజేపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తమిళనాడు ప్రయోజనాలను కాపాడాల్సిన ముఖ్యమంత్రి, ముందుగా మేకదాటు ప్రాజెక్టుపై తన వ్యతిరేకతను స్పష్టంగా తెలియజేయాల్సిందని బీజేపీ నేతలు అంటున్నారు. కర్ణాటక సీఎం ప్రాజెక్టు నిర్మాణంపై పట్టుదలగా ఉన్న సమయంలో విజయ్ ఆయనతో స్నేహపూర్వకంగా కనిపించడం తప్పు సంకేతాలు ఇస్తోందని విమర్శిస్తున్నారు. రాష్ట్ర హక్కుల విషయంలో రాజకీయ రాజీలు ఉండకూడదని బీజేపీ వాదిస్తోంది. ఈ ఘటనను విజయ్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉపయోగించుకుంటోంది.బీజేపీతో పాటు తమిళనాడులోని ప్రధాన ప్రతిపక్షాలు కూడా విజయ్‌పై విమర్శలు పెంచాయి. డీఎంకే నేతలు విజయ్ మేకదాటు సమస్యను సీరియస్‌గా తీసుకోవడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై రాష్ట్రంలోని అన్ని పార్టీలతో సమావేశం నిర్వహించి ఉమ్మడి వైఖరిని ప్రకటించాలని మాజీ సీఎం స్టాలిన్ డిమాండ్ చేశారు. మేకదాటు విషయంలో రాజకీయాలకు అతీతంగా తమిళనాడు ఒక్కటిగా నిలవాలని పిలుపునిచ్చారు. అన్నాడీఎంకే కూడా విజయ్ తీరును తప్పుబట్టింది. కాంగ్రెస్ మద్దతుపై ఆధారపడటం వల్లే కర్ణాటక విషయంలో గట్టిగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించింది. రాష్ట్ర హక్కుల కంటే ముఖ్యమంత్రి పదవికే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించిందిమరోవైపు విజయ్ కూడా ఈ వివాదంపై స్పందించారు. కావేరీ సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలన్న ఉద్దేశంతో కర్ణాటకకు వెళ్లాలని భావించినట్లు తెలిపారు. తమిళనాడు ప్రజల ప్రయోజనాల కోసం అవమానాలు ఎదురైనా భరించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. కావేరీ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మేకదాటు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. పొరుగు రాష్ట్రంతో చర్చలు జరపడం తప్పు కాదని, సమస్యకు పరిష్కారం కనుగొనడమే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. దీంతో ఈ వివాదం కేవలం వేదిక పంచుకున్న అంశం నుంచి, విజయ్ రాజకీయ వైఖరి చుట్టూ తిరిగే చర్చగా మారింది.విజయ్ తీరును కాంగ్రెస్ నేతలు సమర్థించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఆహ్వానం మేరకే ఆయన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారని కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ తెలిపారు. ఒక కార్యక్రమంలో ఇద్దరు ముఖ్యమంత్రులు కలుసుకోవడాన్ని నీటి వివాదంతో ముడిపెట్టడం సరికాదని అన్నారు. బీజేపీ, డీఎంకే రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నాయని విమర్శించారు. అయితే కాంగ్రెస్ సమర్థనతో వివాదం సద్దుమణగలేదు. తమిళనాడు హక్కుల విషయంలో విజయ్ మరింత స్పష్టంగా వ్యవహరించాలన్న డిమాండ్ కొనసాగుతోంది.మేకదాటు వివాదం రాజకీయాలకే పరిమితం కాలేదు. న్యాయపరంగానూ కొనసాగుతోంది. 2018లో కావేరీ జలాల పంపిణీపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తమిళనాడుకు ఏటా 177.25 టీఎంసీల నీరు కేటాయించింది. 2025 నవంబర్‌లో మేకదాటు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ తయారీ అనుమతిపై తమిళనాడు వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. అయితే దీనివల్ల ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిందని కాదు. 2026 జూన్‌లో కేంద్ర జల సంఘం కర్ణాటక సమర్పించిన డీపీఆర్‌ను తిరిగి పంపింది. కావేరీ జలాల కేటాయింపులకు అనుగుణంగా మార్పులు చేయాలని సూచించింది. అంటే ప్రాజెక్టు నిర్మాణానికి ఇంకా అనేక అనుమతుల ప్రక్రియలు మిగిలే ఉన్నాయి.ఈ వివాదంలో అసలైన ఆందోళన రైతులదే. కావేరీ నీరు సకాలంలో అందకపోతే పంటలు దెబ్బతింటాయి. సాగు ఖర్చులు పెరుగుతాయి. రైతుల ఆదాయంపై ప్రభావం పడుతుంది. తమిళనాడులోని కావేరీ డెల్టా ప్రాంతం వ్యవసాయానికి ఎంతో కీలకం. కర్ణాటకలోనూ తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల అవసరాలు నిజమైనవే అయినప్పటికీ.. నీటి పంపిణీలో ఎవరికీ అన్యాయం జరగకూడదు. నీటి చుక్క రైతుకు జీవం. రాజకీయ నాయకుడికి అది కేవలం ఎన్నికల అంశం కాకూడదు.సినీ రంగం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌కు ఇది కీలకమైన పరీక్షగా మారింది. ప్రజాదరణ సంపాదించడం ఒక ఎత్తు. రాష్ట్ర సమస్యలను పరిష్కరించడం మరో ఎత్తు. ఒకవైపు కాంగ్రెస్ నేతలతో రాజకీయ సంబంధాలు కొనసాగించాలి. మరోవైపు కర్ణాటకతో నీటి వివాదంలో తమిళనాడు ప్రయోజనాలను కాపాడాలి. ఈ రెండింటి మధ్య సమతూకం పాటించడం విజయ్‌కు సవాలుగా మారింది. ముఖ్యంగా మేకదాటు విషయంలో ఆయన తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో రాజకీయంగా ప్రభావం చూపనున్నాయి. మేకదాటు వివాదం ఇప్పుడు నీటి సమస్యను దాటి రాజకీయ పోరాటంగా మారింది. కర్ణాటక తన ప్రాజెక్టు కోసం పట్టుబడుతోంది. తమిళనాడు తన నీటి హక్కుల కోసం పోరాడుతోంది. మధ్యలో విజయ్ రాజకీయ వైఖరి చర్చనీయాంశంగా మారింది. బీజేపీ విమర్శలు. డీఎంకే, అన్నాడీఎంకే ఆరోపణలు. కాంగ్రెస్ సమర్థనతో వ్యవహారం మరింత వేడెక్కింది. రాజకీయ బంధాలు మారుతుంటాయి. కానీ రాష్ట్ర ప్రయోజనాలు శాశ్వతం. మేకదాటు విషయంలో విజయ్ మాటలకు, చేతలకు మధ్య స్పష్టత కనిపించాల్సి ఉంది. తమిళనాడు నీటి హక్కుల కోసం ఆయన ఎంత బలంగా నిలబడతారన్నదే ఈ రాజకీయ వివాదంలో కీలకంగా మారనుంది.

వంద శాతం లక్ష్యంతో జనసేన



ఒంగోలు : ఏపీలో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయం ఊపందుకుంది. నాలుగు కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికలకు సర్వం సిద్ధం అయింది. ఇప్పటికే పొలిటికల్ పార్టీలు క్యాండిడేట్స్‌ను అనౌన్స్ చేసి క్యాంపెయిన్‌లో జోరు పెంచుతున్నాయి. ఎస్పెషల్‌గా ఫస్ట్ ఫేజ్‌లో పురపోరలో వచ్చిన ఫలితాల్లో కూటమిలో జోరు ఎక్కువగా కనిపిస్తోంది. జనసేన పార్టీ ఇప్పుడు జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటుంది.ఇప్పటికే తొలి విడతలో మంచి ఫలితాలు సాధించిన ఆ పార్టీ..రెండో విడతలోనూ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులకు అభ్యర్థులను ఖరారు చేశారు ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. స్థానిక రాజకీయ పరిస్థితులు, పార్టీ బలాబలాలను పరిగణనలోకి తీసుకొని క్యాండిడేట్స్‌ను సెలెక్ట్ చేసిన పవన్..కూటమిలో టీడీపీ, బీజేపీ కోఆర్డినేషన్‌పై పార్టీ నేతలకు డైరెక్షన్స్ ఇచ్చారట.ఏపీలో కూటమిలో రెండో బలమైన మిత్రపక్షంగా ఉన్న జనసేనకు పొత్తులో భాగంగా నాలుగు మేయర్ పదవులతో పాటు 21 మున్సిపల్, నగర పంచాయతీ చైర్మన్ పదవులు దక్కాయి. అయితే కొన్ని అనివార్య కారణాలు, న్యాయపరమైన ఇబ్బందులతో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగలేదు. అందులో జనసేనకు కేటాయించిన నాలిగింటిలో రెండు కార్పొరేషన్లతో 3 మున్సిపాలిటీలు ఉన్నాయి. శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి, కాకినాడ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేర్లు ఖరారు చేశారు. అలాగే రాజాం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత, భీమవరం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం చైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను ఎంపిక చేశారు పవన్.మ్యాప్‌లు చూడండిమొదటి దశలో జనసేన పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీల చైర్మన్ స్థానాలన్నింటిలో ఘన విజయం సాధించింది. పిఠాపురం, గొల్లప్రోలు, తుని, నిడదవోలు, నరసాపురం, పెడన, తిరువూరు, చిలకలూరిపేట, సాలూరు, అమలాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో జెండా ఎగరవేసింది ఆ పార్టీ. విజయవాడ, ఏలూరు మేయర్ పీఠాలను కూడా స్వాధీనం చేసుకుంది. దీంతో రెండో విడతలో కూడా సెంట్ పర్సెంట్ విజయాలను దక్కించుకోవాలని జనసేన వ్యూహ రచన చేస్తోంది.తొలి విడత ఎన్నికల్లో జనసేనకు అనుకూలమైన ఫలితాలు రావడం పార్టీ నాయకత్వంలో ఉత్సాహాన్ని పెంచింది. ఆ దశలో పోటీ చేసిన 15 మున్సిపాలిటీలు, మూడు నగర పంచాయతీల చైర్మన్ స్థానాలను పార్టీ గెలుచుకుని ఫుల్ జోష్‌లో ఉంది. పట్టణ ప్రాంతాల్లో తమ పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని జనసేన నాయకులు అంచనా వేస్తున్నారట. అయితే రెండో విడతలో పరిస్థితులు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. స్థానికంగా అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఓటర్ల మద్దతు ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి.కేవలం అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో టీడీపీ, బీజేపీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం, ప్రజలు ఆకట్టుకోవడం సవాల్‌గా చెబుతున్నారు. అయితే కాకినాడలో జనసేనకు అనుకూలంగానే ఉన్నా..20ఏళ్ల తర్వాత జరుగుతున్న సిక్కోలు కార్పొరేషన్‌లోనే ఎలాంటి సీన్ ఉండబోతుందనే చర్చ జరుగుతోంది. అక్కడ వైసీపీ టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యే గుండలక్ష్మీని అభ్యర్థిగా పెడుతుంది. సేమ్‌టైమ్ మాజీమంత్రి ధర్మాన సిక్కోలు మేయర్ ఎన్నికలకు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని పనిచేస్తున్నారు. శ్రీకాకుళంలో బలమైన అనుచర వర్గం, ఫాలోయింగ్ ఉన్న గుండలక్ష్మీని పార్టీలోకి చేర్చుకొని కూటమికి సవాల్ విసురుతోంది వైసీపీ.మరోవైపు మేయర్ పీఠం ఆశించి నిరాశపడ్డ తెలుగు తమ్ముళ్లు జనసేన అభ్యర్థి విజయానికి ఎంతవరకు సహకరిస్తారన్నది కూడా బిగ్ క్వశ్చన్‌గా మారిందట. అయితే జిల్లా మంత్రులు, జనసేన కోఆర్డినేటర్లు..సిక్కోలు కార్పొరేషన్‌పై జెండా ఎగరవేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్. ఈ నెల 26న జరగనున్న రెండో దశ పురపోరుకు జనసేన రాజకీయ బలానికి మరో పరీక్షగా నిలవనుందనే చర్చ జరుగుతుంది. ఫస్ట్ ఫేజ్ రిజల్ట్‌లాగే అదే స్ట్రైక్ రేటును కొనసాగించి రెండో దశలోనూ మెరుగైన ఫలితాలు సాధిస్తుందా.? లేదా అన్నది.? పొలిటికల్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.

మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి..
మూడు నెలల్లోనే జాహిద్ నగర్‌లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

- రూ.27 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం.. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశం

ఉప్పల్, నవంబర్ 18 (మన మీ వార్త):

ఇచ్చిన మాట ప్రకారం మూడు నెలల్లోనే జాహిద్ నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తన హామీని నిలబెట్టుకున్నారు. ఉమ్మడి చిలకనగర్ డివిజన్ పరిధిలోని బీరప్పగడ్డ డివిజన్ జాహిద్ నగర్‌లో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. జాహిద్ నగర్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తామని మూడు నెలల క్రితం ఇచ్చిన హామీ మేరకు నిర్ణీత సమయంలోనే పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ప్రజలకు



ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే సూచించారు. కాలనీవాసులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొక్కొండ జగన్, ఏదుల్ల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రామాంజనేయులు, ఫారూక్,



ఓబేద్, ఆజాద్, శ్యామ్, బాలు యాదవ్, సాయి టవర్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు సురేష్, శ్రీ నికేతన్ అపార్ట్‌మెంట్ అధ్యక్షుడు మోహన్, వేద సింధు, శ్రీకాంత్ రెడ్డి, సునీల్ రావు, మురళి, భాస్కర్ రెడ్డి, హనుమంతు రెడ్డి, రామ్ రెడ్డి, రాము, మీనేష్, ఇక్బాల్, ప్రకాష్ రావు, సత్యనారాయణ, గంగ స్వామి, విజయ్, రఘునందన్, సమద్ భాయ్, మీరాజ్, ముజీబ్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య స్కూల్ లో ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం విజయవంతం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న-తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కో కన్వీనర్ నిరంజన్ దేశాయ్

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 18 (మన మీ వార్త)

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని భారతీయ జనతా పార్టీ చెంగిచెర్ల డివిజన్ ఎండోమెంట్ కన్వీనర్ కూరాకుల సాయి కృష్ణ ఆధ్వర్యంలో, శ్రీ చైతన్య స్కూల్ లో ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం నిర్వహించి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయడం జరిగింది .

ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కో-కన్వీనర్ నిరంజన్ దేశాయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు లో భాగస్వాములై ప్రజాస్వామ్య ప్రక్రియను బలోపేతం చేయాలని పిలుపునివ్వడం జరిగింది.

ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె శ్రీనివాస్ , ఎండోమెంట్ సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ దేవి ప్రసాద్ , ఎండోమెంట్ సెల్ మేడ్చల్ రూరల్ జిల్లా కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్ , సీనియర్ నాయకులు వేమునూరు మురళీధర్ , కో-కన్వీనర్లు ఎం. అశోక్ , నవ్య రెడ్డి , మాధవీలత , మేడిపల్లి ఎండోమెంట్



కన్వీనర్ ఎం. సంజీవ తదితర నాయకులు పాల్గొన్నారు.

రామంతపూర్ జె ఎస్ పి ఎస్ ప్రభుత్వ హోమియో వైద్య కళాశాలలో
59వ వార్షికోత్సవ సందడి.. 'జేఎస్పీఎస్ ఖేలో' క్రీడా పోటీలు ప్రారంభం







- విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం

- ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు

రామంతాపూర్, నవంబర్ 18 (మన మీ వార్త):

రామంతాపూర్‌లోని జేఎస్పీఎస్ ప్రభుత్వ హోమియోపతి వైద్య కళాశాల 59వ వార్షికోత్సవ వేడుకలకు ఘనంగా శ్రీకారం చుట్టారు. వార్షికోత్సవ ప్రారంభ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కళాశాలలో 'జేఎస్పీఎస్ ఖేలో' పేరుతో క్రీడా పోటీలను ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు క్రీడా పోటీలను ప్రారంభించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఏడాది పొడవునా చదువులు, పరీక్షలు, విద్యా సంబంధిత కార్యక్రమాలతో బిజీగా ఉంటారని, ఇలాంటి క్రీడా పోటీలు వారికి మానసిక ప్రశాంతతను, నూతన ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు.పది రోజులపాటు నిర్వహించనున్న ఈ క్రీడా కార్యక్రమాలను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. క్రీడాస్ఫూర్తి, ఐక్యత, క్రమశిక్షణ, పరస్పర సహకారం వంటి విలువలను క్రీడలు అలవర్చుతాయని తెలిపారు. ఈ నెల 28వ తేదీన కళాశాల 59వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటుండటంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. రాబోయే రోజుల్లో వివిధ క్రీడా పోటీలను నిర్వహించి విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికితీయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కృష్ణమూర్తి, స్పోర్ట్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ దాసరి పార్థసారథి, కమిటీ సభ్యులు, కళాశాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంతోష్ నగర్‌లో అభివృద్ధి జోరు.. సీసీ రోడ్డుతో కాలనీకి కొత్త కళ!

- డివిజన్-3లో మౌలిక వసతులపై ఫోకస్

- రోడ్డు పనులకు భూమిపూజ చేసిన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్

జవహర్ నగర్ , నవంబర్ 18 (వార్త ప్రతినిధి)

జవహర్ నగర్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సంతోష్ నగర్‌లో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్-3 కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి భూమిపూజ చేసి రోడ్డు పనులను లాంఛనంగా ప్రారంభించారు.

అభివృద్ధే ధ్యేయం...

ఈ సందర్భంగా శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, కాలనీల అభివృద్ధే ధ్యేయంగా తాము నిరంతరం పనిచేస్తున్నామని తెలిపారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి, దశలవారీగా రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.



సంతోష్ నగర్‌లో చాలా కాలంగా రోడ్డు సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తమ దృష్టికి రాగానే వెంటనే పనులు మంజూరు చేయించి ప్రారంభించామని చెప్పారు. నాణ్యతతో, నిర్ణీత సమయంలోనే రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

భారీగా తరలివచ్చిన కాలనీవాసులు...

ఈ కార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు మాట్ల వినయ్, ప్రధాన కార్యదర్శి డి.ఎస్.ఎస్. వెంకటేశ్వర్, విజయరాయ్, యువజన విభాగం అధ్యక్షులు సోమేశ్ చారి, నాయకులు వీర్ల భుజంగం, రాజు యాదవ్, గజ్వెల్ శంకర్, రఫిక్, అజయ్, మధులతో పాటు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కాలనీ పెద్దలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభమైనందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హెడ్ వరల్డ్ మానవ హక్కుల మండలి తెలంగాణ డైరెక్టర్ గా సురేష్ గుప్తా వీరమళ్ల నియామకం

- మానవ హక్కుల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తా: సురేష్ గుప్తా

హైదరాబాద్, నవంబర్ 18 (మన మీ వార్త):



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెడ్ వరల్డ్ మానవ హక్కుల మండలి తెలంగాణ రాష్ట్ర సంచాలకుడిగా సురేష్ గుప్తా వీరమళ్ల నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంస్థ అధ్యక్షుడు మాధవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఈ సందర్భంగా సురేష్ గుప్తా వీరమళ్ల మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ గా బాధ్యతలు అప్పగించిన సంస్థ అధ్యక్షుడు మాధవ్‌కు, తన నియామకానికి కృషి చేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మానవ హక్కుల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని, హక్కులకు భంగం కలిగిన బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా నిరంతరం పోరాడుతానని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు, ఎక్కడైనా మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగినప్పుడు సంస్థ తరఫున ధైర్యంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు.తనకు అప్పగించిన ఈ బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

ఈ సందర్భంగా సంస్థ సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు సురేష్ గుప్తా వీరమళ్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నాచారం డివిజన్ 21 చర్చిల ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

- నూతన కమిటీ సభ్యులకు ముఖ్య అతిథి మేడల మల్లికార్జున్ గౌడ్ అభినందనలు





నాచారం, నవంబర్ 18 (మన మీ వార్త):

నాచారం డివిజన్ 21 పరిధిలోని చర్చిల ఫెలోషిప్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేడల మల్లికార్జున్ గౌడ్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ సోదరుల మధ్య ఐక్యతను పెంపొందించడంతో పాటు, సేవాభావంతో సమాజ అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజంలో శాంతి, సోదరభావం, మానవత్వం వెల్లివిరిసేలా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ప్రెసిడెంట్ గా రెవరెండ్ విలియం,వైస్ ప్రెసిడెంట్ గాపాస్టర్ ప్రసాద్,సెక్రటరీ గా రెవరెండ్ డాక్టర్ లాజరస్,జాయింట్ సెక్రటరీ గా పాస్టర్ హేమంత్,సలహాదారులు, కమిటీ సభ్యులుగా రెవరెండ్ దొడ్ల విల్సన్, రెవరెండ్ ఎఫెన్, పాస్టర్ అభిషేక్, పాస్టర్ పాల్, పాస్టర్ తిమోతి, పాస్టర్ జోసెఫ్, పాస్టర్ సైమన్, సిస్టర్ ఆశాజ్యోతి, సిస్టర్ బాలమణి, బ్రదర్ మోజస్ లు ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా ముఖ్య అతిథి మేడల మల్లికార్జున్ గౌడ్ నూతన కమిటీ సభ్యులందరికి అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కమిటీ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలకు తన సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు.నూతన కమిటీ నాయకత్వంలో చర్చిల ఫెలోషిప్ మరింత అభివృద్ధి చెందాలని, క్రైస్తవ సోదరులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు సేవలందించాలని పలువురు ఆకాంక్షించారు.

తాటిగూడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కాసిపేట, నవంబర్ 18:(మన మీ వార్త మండల ప్రతినిధి)

మండలంలోని తాటిగూడ గ్రామపంచాయతీలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని తెలిపారు. కాగితపు రేషన్ కార్డులతో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారంగా స్మార్ట్ కార్డులు ఉపయోగపడతాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరై కార్డులు పంపిణీ చేసిన చైర్మన్ రత్నం సుకుమారికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రత్నం ప్రదీప్, డైరెక్టర్ పుత్తూరి సత్తయ్య, రేషన్ డీలర్ జానకి-శంకర్, కాంగ్రెస్ నాయకులు వైద్యం రమేష్, నందం, ఓల్లపు మహంకాళి, ప్రశాంత్, మడావి జమున, మడావి దేవు, సిడం శ్రీనివాస్ తదితర నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హబ్సీగూడలో అయ్యప్ప స్వాముల మహాపడి పూజలో పాల్గొన్న డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి

- అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కంది శ్రవణ్ కుమార్ రెడ్డి





హబ్సీగూడ, నవంబర్ 18 (మన మీ వార్త):

హబ్సీగూడ డివిజన్‌లో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. అయ్యప్ప భక్తులు గౌతమ్ చిన్ను ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి హబ్సీగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. పడి పూజ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అయ్యప్ప స్వాముల భక్తి, ఆధ్యాత్మిక నిబద్ధత ప్రశంసనీయమని అన్నారు.

అనంతరం నిర్వాహకులు, అయ్యప్ప భక్తులతో ఆయన కొద్దిసేపు ముచ్చటించారు. ఈ పూజా కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు.

కాసిపేట మోడల్ స్కూల్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సు

కాసిపేట, నవంబర్ 18:(మన మీ వార్త మండల ప్రతినిధి)



విద్యార్థుల రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌కు ప్రత్యేక ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది విజ్ఞప్తి మేరకు మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ నరేష్ కుమార్ ఈ సౌకర్యాన్ని కల్పించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు.మంచిర్యాల, క్యాతన్‌పల్లి, మందమర్రి, సోమగూడెం తదితర ప్రాంతాల నుంచి రోజూ 200 మందికి పైగా విద్యార్థులు పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. సరైన రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ప్రైవేటు వాహనాలపై ఆధారపడుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఈ బస్సు ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు మంచిర్యాల నుంచి బయలుదేరి 9 గంటలలోపు పాఠశాలకు చేరుకుంటుందని వెల్లడించారు. బుధవారం బస్సు ప్రారంభమైన సందర్భంగా డ్రైవర్, కండక్టర్‌లను పాఠశాల ఉపాధ్యాయులు గణేష్, చైతన్య స్రవంతి, స్వప్నరాణి, మోహన్, రాకేష్, సంయుక్త, అనిత, భాగ్యశ్రీ సత్కరించారు.

విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసిన ఆర్టీసీ మంచిర్యాల డిపో మేనేజర్ నరేష్ కుమార్‌కు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

అమీన్‌పూర్‌లో మూడేళ్ల చిన్నారి అదృశ్యం

- సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

- చిన్నారి ఆచూకీ కోసం ప్రత్యేక గాలింపు చర్యలు

పటాన్‌చెరు, నవంబర్ 18, మీ వార్త ప్రతినిధి:





అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మూడేళ్ల చిన్నారి అదృశ్యం తీవ్ర కలకలం రేపింది. చిన్నారి కిడ్నాప్‌కు గురైందన్న అనుమానాలు వ్యక్తమవుతుండటంతో పోలీసులు అప్రమత్తమై గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.వివరాల్లోకి వెళితే.. ఆర్ఆర్ హోమ్స్‌లో నివాసం ఉంటున్న సరిత (24) అనే మహిళ కుమార్తె అక్షిత (3) బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి కనిపించకుండా పోయింది. చిన్నారి తల్లి కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నట్లు తెలిసింది. మధ్యాహ్నం నుంచి చిన్నారి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.చిన్నారి కిడ్నాప్‌కు గురై ఉండవచ్చన్న అనుమానంతో అమీన్‌పూర్ పోలీసులు కేసును తీవ్రంగా పరిగణించి దర్యాప్తు చేపట్టారు. సీఐ ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసు బృందం ఆర్ఆర్ హోమ్స్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.చిన్నారి ఎక్కడికి వెళ్లింది? ఏమైనా అపహరణకు గురైందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అక్షిత ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. చిన్నారి అదృశ్య ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది.

దమ్మాయిగూడలో ప్రారంభమైన ప్రణవ ఫ్యూయల్ పెట్రోల్ పంప్.. వాహనదారులకు ఇక ఇంధన కష్టాలు తీరినట్లే...





- కీసర సర్కిల్ వద్ద వైభవంగా ప్రారంభోత్సవం

- నాణ్యమైన ఇంధనం, మెరుగైన సేవలే లక్ష్యమన్న నిర్వాహకులు

దమ్మాయిగూడ / జవహర్ నగర్, నవంబర్ 18: (వార్త ప్రతినిధి)

కీసర సర్కిల్, దమ్మాయిగూడ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ప్రణవ ఫ్యూయల్' పెట్రోల్ పంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. సంస్థ అధినేతలు బల్లి శ్రీనివాస్, బూరుగు అనిల్, సకిలం మురళి, ఆవురు మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై పంపును ప్రారంభించారు.

ముఖ్య అతిథులుగా ప్రముఖులు...

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుదగాని మల్లేష్ గౌడ్, తాడూరి శ్రీనివాస్ తదితరులు విచ్చేసి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

స్థానిక ప్రజలకు, వాహనదారులకు నాణ్యమైన ఇంధనం, మెరుగైన సేవలు అందించాలని అతిథులు ఆకాంక్షించారు. ఈ ప్రాంత వాహనదారులకు కొత్త పంప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, కీసర - దమ్మాయిగూడ రహదారిపై పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఇది ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు.

స్థానిక నాయకుల సందడి...

ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు రామారావు, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, పండాల యాదగిరి గౌడ్, స్థానిక కార్పొరేటర్లు బల్లి రోజా శ్రీనివాస్, కుతాడి సాయి కుమార్, గొడుగు వేణు, జమాల్పూర్ నవీన్, మనోహర్ రెడ్డి, బింగి సతీష్, గండి రాంచంద్రం పాల్గొన్నారు.

వీరితో పాటు స్థానిక నాయకులు, ప్రముఖులు కృష్ణాగౌడ్, ఫరూక్, రవి, బోనాల శ్రీనివాస్, పెద్ది నాగరాజ్, బేలదే రమేష్, పెద్ది మురళి, మాట్ల వినయ్, సాగంటి వెంకటేష్, గజ్వేల్ శంకర్, నాయకం భాస్కర్, డీఎస్ఎస్ వెంకటేశ్వర్లు, నంగునూరి అశోక్, రేబెల్లి శ్రీనివాస్, గంప కృష్ణ, పొలాస సాయి కిరణ్, జడల బాలకృష్ణ, రూపం, బొబ్బిలి మంజుల, రజిత, గోపాల్, అనంతలక్ష్మి, విజయ, విజయరాయ్, కుతాడి మల్లేష్, నర్సిములు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నిర్వాహకులు విచ్చేసిన అతిథులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రారంభోత్సవ సందర్భంగా వాహనదారులకు ప్రత్యేక ఆఫర్లు, నాణ్యమైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు.

బాలకృష్ణ నగర్ ఫేస్--3లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు..

- కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు కృషి చేస్తాం: ఆకారపు అరుణ్ పటేల్

- కాలనీవాసుల విజ్ఞప్తిపై క్షేత్రస్థాయిలో పరిశీలన.. ఎస్టిమేషన్ సిద్ధం చేయించిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు

వెంకట్ రెడ్డి నగర్, నవంబర్ 18 (మన మీ వార్త):

బాలకృష్ణ నగర్ ఫేస్--3 కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ హామీ ఇచ్చారు. కాలనీలో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కాలనీ అధ్యక్షురాలు వీణ గోపాల్ ఆయన దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై వెంటనే స్పందించిన ఆకారపు అరుణ్ పటేల్ సంబంధిత అధికారులతో పాటు రవీందర్ రెడ్డిని తీసుకుని కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కాలనీవాసులతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలుసుకున్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఎస్టిమేషన్ సిద్ధం చేయించారు.ఈ పనులకు నిధులు మంజూరు చేయించే దిశగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డితో మాట్లాడి, సంబంధిత పనులకు శాంక్షన్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని అరుణ్ పటేల్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పనిచేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణ





నగర్ ఫేస్--2 అధ్యక్షుడు కాసింగౌడ్, గౌరవ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు స్వామి, షబీర్ కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ అశ్వక్, శంకర్, నాగరాజు, సతీష్, చంద్రమోహన్, రఘు, పాషా, నవీన్, నరసింహాచారి తదితరులు పాల్గొన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఆకారపు అరుణ్ పటేల్‌కు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గుడి పేరుతో గుట్ట తవ్వకం.. ప్రభుత్వ భూమి కబ్జాపై కలకలం!

- స్మశాన వాటికల దారి మూసేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు

- వెంటనే సర్వే చేసి న్యాయం చేయాలని డిమాండ్

కాప్రా / జవహర్ నగర్ , నవంబర్ 18 (వార్త ప్రతినిధి)

ఆలయ నిర్మాణం పేరుతో అక్రమంగా రాళ్ళగుట్టను తవ్వేస్తూ, ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ జవహర్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ నయా ఈద్గా (స్మశాన వాటిక) కమిటీ బాధ్యులు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కాప్రా మండల తహసీల్దార్, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

రహదారికి అడ్డంకులు.. అక్రమ తవ్వకాలు:

కీసర సర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని వికలాంగుల కాలనీలో హిందూ, ముస్లిం స్మశాన వాటికలు పక్కపక్కనే ఉన్నాయి. అయితే, ఇద్దరు వ్యక్తులు ఈ స్మశాన వాటికలకు వెళ్లే ప్రధాన రహదారిని అడ్డగిస్తున్నారని కమిటీ సభ్యులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రభుత్వం నుండి ఎటువంటి అనుమతులు లేకుండానే అక్కడున్న భారీ కొండ రాళ్ళగుట్టను తొలుస్తూ, అక్రమంగా మట్టిని తరలిస్తూ ప్రభుత్వ భూమిని



ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఇది పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగించడమే కాకుండా, ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టడమేనని మండిపడ్డారు.

బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపణ:

అక్రమ తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన కమిటీ సభ్యులపై సదరు వ్యక్తులు మతం, గుడి పేరుతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని బాధ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. "గుడి కట్టడానికి దేనికైనా సిద్ధం.. ఎవరు అడ్డుకుంటాడో చూస్తాం" అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు.

ప్రభుత్వ భూమిని తమ సొంత ఆస్తిగా చెప్పుకుంటూ, ప్రశ్నించిన వారిపై నకిలీ డాక్యుమెంట్లతో విరుచుకుపడుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల స్థానికంగా ఇరు వర్గాల మధ్య విద్వేషాలు చెలరేగి, శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కమిటీ ప్రధాన డిమాండ్లు:

- వివాదాస్పద భూమిపై వెంటనే సర్వే నిర్వహించి, అది ప్రభుత్వ భూమా లేక ప్రైవేటు భూమా అనేది తేల్చాలి.
- అనుమతులు లేకుండా జరుగుతున్న రాళ్ళగుట్ట తవ్వకాలు, మట్టి తరలింపును తక్షణమే నిలిపివేయాలి.
- స్మశాన వాటికలకు వెళ్లే రహదారిని యథావిధిగా పునరుద్ధరించాలి.
- నకిలీ పత్రాలతో ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.
- బెదిరింపులు ఎదుర్కొంటున్న కమిటీ సభ్యులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలి.

తమ ఆరోపణలకు సంబంధించిన వీడియో ఆధారాలను కూడా అధికారులకు సమర్పించినట్లు కమిటీ బాధ్యులు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో సయ్యద్ ముబాషీర్ (అబ్బు), సయ్యద్, ఎండీ గౌస్, మదర్ తెరిసా-లెప్రసీ కాలనీ అధ్యక్షులు మరియు చంద్రపురి కాలనీ డివిజన్-2 కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, ఏ.ఐ.ఏఫ్.టీ.యూ రాష్ట్ర అధ్యక్షులు, ఆదర్శనగర్ కాలనీ అధ్యక్షులు వై. మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సాయి గౌతమి కాలేజీలో ప్రజా భరోసా కార్యక్రమం

- విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

మీ వార్త నవంబర్ 18 సూర్యాపేట జిల్లా ప్రతిని



సూర్యాపేట విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట సైబర్ క్రైమ్ డీఎస్పీ ప్రసన్నకుమార్ సూచించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సాయి గౌతమి కళాశాలలో నిర్వహించిన ప్రజా భరోసా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకులు నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు ఎవరికీ వెల్లడించకూడదని తెలిపారు. ఆన్‌లైన్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా మహిళల భద్రత, షీ టీమ్స్ సేవలు, ర్యాగింగ్, వేధింపులు, బాలల భద్రత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వెంకటయ్య, సీసీఎస్ సీఐ శివకుమార్, షీ టీమ్ ఉమెన్ ఎస్సై నీలిమ, ,సాయి గౌతమి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ భగవాన్ రెడ్డి, ప్రిన్సిపల్ ఎర్రగానీ లక్ష్మయ్య, డైరెక్టర్ తీ కుల్ల సోమిరెడ్డి మరియు విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు , పోలీస్ సిబ్బంది ఎండి అప్సర్, రాజేందర్ రెడ్డి, యాదగిరి, నాగరాజు, ప్రభాకర్ , పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

కాసిపేట మండలంలో 483 మందికి చేయూత పింఛన్లు



కాసిపేట, నవంబర్ 18:(మన మీ వార్త మండల ప్రతినిధి)

మండలంలోని 22 గ్రామపంచాయతీలకు చెందిన 483 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పంపిణీ చేశారు. బెల్లంపల్లిలోని ఆర్యవైశ్య భవన్ (బాబు క్యాంపు)లో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర వివిధ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రయ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య, సింగిల్ విండో చైర్మన్ శంకర్ గౌడ్, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సఫ్దర్ అలీ, సూపరింటెండెంట్ ఏ. లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, మండల కార్యాలయ సిబ్బంది, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పోలీస్‌స్పోర్ట్స్ ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సాయి చైతన్య

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 18, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు వేడుకలు నిజామాబాద్? జిల్లాలో జరుగనున్నాయి. ఈ మేరకు జానకంపేట్?లో ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సాయి చైతన్య బుధవారం పరిశీలించారు.

క్రీడాకారులకు ఇబ్బందుల్లేకుండా..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పోర్ట్స్?మీట్?కు వచ్చిన క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. జానకంపేటలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో పరేడ్ గ్రౌండ్, ప్రధాన వేదిక, అతిథుల గ్యాలరీ, క్రీడాకారులు, పోలీస్ సిబ్బందికి సంబంధించిన ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్?స్పెక్టర్? మల్లేష్, బోధన్ రూరల్ సీఐ విజయ్?బాబు, రిజర్వ్ ఇన్?స్పెక్టర్? ధరణి, ఎంటీవో శేఖర్ బాబు, ట్రాఫిక్ ఇన్?స్పెక్టర్? వినోద్, ఎస్సైలు, ఆర్ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్నికలపై అవగాహన ఉండాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 18, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



ప్రజాస్వామ్యంలో జరుగుతున్న ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టరేట్లో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కల్పించేందుకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ కాంపిటీషన్స్--2026లో భాగంగా జిల్లా స్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు.

జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు..

అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన 120 మంది విద్యార్థినీవిద్యార్థులు ఇందులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య వ్యవస్థ, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ పత్రాలు అందజేత

- మంత్రి వివేక్ వెంకటస్వామి, కాట శ్రీనివాస్ గౌడ్, నీలం మధు చేతుల మీదుగా లబ్ధిదారులకు పత్రాల పంపిణీ





పటాన్‌చెరు, నవంబర్ 18, మీ వార్త ప్రతినిధి:

పటాన్‌చెరు నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన చేయూత పింఛన్లతో 3,350 మంది లబ్ధిదారులకు ఆర్థిక భరోసా లభించనుంది. ఈ మేరకు బుధవారం గుమ్మడిదల టోల్‌గేట్ సమీపంలోని జీఎస్ఎన్ గార్డెన్స్‌లో నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి వివేక్ వెంకటస్వామి, పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నీలం మధు చేతుల మీదుగా నియోజకవర్గ పరిధిలో కొత్తగా పింఛన్లు మంజూరైన 3,350 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు నెలనెలా ఆర్థిక చేయూత అందనుంది. పింఛన్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన పింఛన్ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్మిక విభాగం సహ కన్వీనర్‌గా ఓర్సు శేఖర్ నియామకం

- కార్మికుల సంక్షేమానికి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా - ఓర్సు శేఖర్

చిలుకానగర్, నవంబర్ 18 (మన మీ వార్త):



భారతీయ జనతా పార్టీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్మిక విభాగం సహ కన్వీనర్‌గా ఓర్సు శేఖర్ నియమితులయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ మాజీ శాసనసభ్యులు డాక్టర్ ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, రాష్ట్ర కార్మిక విభాగం కన్వీనర్ అందె శ్రీనివాస్, మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా కార్మిక విభాగం కన్వీనర్ కర్నాటి యోగేశ్వర్ రెడ్డికి ఓర్సు శేఖర్ ధన్యవాదాలు తెలియజేశారు.

తనకు అప్పగించిన బాధ్యతలను పూర్తి నిబద్ధతతో, క్రమశిక్షణతో నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, ఐక్యత కోసం పనిచేస్తానని తెలిపారు.

కార్మికులకు ఎదురయ్యే ఎలాంటి సమస్యనైనా పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా, ముఖ్యంగా చిలుకా నగర్ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కార్మికుడికి అందేలా కృషి చేస్తానని, ఎల్లప్పుడూ కార్మికులకు అండగా నిలుస్తానని ఓర్సు శేఖర్ స్పష్టం చేశారు.

బ్యాంకుల్లో మధ్య దళారుల వ్యవస్థను రద్దు చేయాలి

- సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్

చిట్యాల నవంబర్ 18 మీ వార్త



టేకుమట్ల: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్, కాకతీయ గ్రామీణ బ్యాంకుల్లో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మధ్య దళారుల వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని సిపిఐ ఎంఎల్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు.

బ్యాంకుల్లో రైతులకు అందాల్సిన రుణాలు, ఇతర బ్యాంకింగ్ సేవల విషయంలో కొంతమంది మధ్య దళారులు జోక్యం చేసుకుంటూ రైతుల నుంచి అధిక వడ్డీలు, అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికే వ్యవసాయ పెట్టుబడుల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, ఇటువంటి మధ్య దళారుల కారణంగా మరింత అప్పుల భారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు బ్యాంకుల ద్వారా నేరుగా సేవలు అందించాల్సిన అధికారులు, మధ్య దళారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బ్యాంకులకు వచ్చే రైతులను దళారుల వద్దకు పంపకుండా, వారికి అవసరమైన రుణాలు, బ్యాంకింగ్ సేవలను పారదర్శకంగా అందించాలని సూచించారు. మధ్య దళారులు రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అధిక వడ్డీల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని అన్నారు. రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

యూనియన్ బ్యాంక్, కాకతీయ గ్రామీణ బ్యాంకుల ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బ్యాంకుల్లో మధ్య దళారుల జోక్యాన్ని పూర్తిగా అరికట్టాలని, రైతులకు నేరుగా బ్యాంకింగ్ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేస్తా ఉన్న చర్యలు తీసుకోకపోతే రైతుల సమీకరించి బ్యాంకుల ముందు ఆందోళన చేస్తామని తెలియజేస్తున్నాను సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు సంగి అంజయ్య సంగీరాజు గుర్రపు శంకర్ పాల్గొన్నారు.

కౌకూర్ లో వెలుగులు నింపుతున్న మిషన్ బ్రైట్..

- 3 కాలనీల్లో 34 కొత్త వీధి దీపాలు - చీకటి వీధులకు చెక్ పెట్టిన మల్లికార్జున్ టీమ్

కౌకూర్ , నవంబర్ 18: (వార్త ప్రతినిధి)



మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న "మిషన్ బ్రైట్ కౌకూర్" కార్యక్రమంలో మరో ముందడుగు పడింది. మాజీ మంత్రి మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో కౌకూర్ పరిధిలోని సమాల లక్ష్మీనగర్, భర్వపేట్, భారత్ నగర్ కాలనీలలో సుమారు 34 నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగింది.

కాలనీలలో రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కల్పించడంతో పాటు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రజల అవసరాలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మిషన్ బ్రైట్ కౌకూర్ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తున్నట్లు తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు.

మల్లికార్జున్ మాటల్లో...

"కౌకూర్‌లో ఏ వీధి చీకటిగా ఉన్నా అది మా దృష్టికి తీసుకురండి. వెంటనే అక్కడ లైట్ వేస్తాం. మహిళలు, పిల్లలు, వృద్ధులు రాత్రి వేళ నిర్భయంగా తిరగాలి. అదే మిషన్ బ్రైట్ కౌకూర్ లక్ష్యం. కౌకూర్‌ను పూర్తిగా వెలుగులమయం చేసే వరకు ఈ కార్యక్రమం ఆగదు" అని ఆయన స్పష్టం చేశారు.

పాల్గొన్న నాయకులు...

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లి మల్లేష్, అల్లి పండు, గౌరీనాథ్, గోమారం ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జీకే రావు, లక్ష్మా రెడ్డి, వంటల అన్నయ్య, మహిపాల్ రెడ్డి తదితరులు, ఆయా కాలనీల వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటుతో కాలనీల్లో సంతోషం వెల్లివిరిసింది. తమ సమస్యను పరిష్కరించిన మైనంపల్లి హనుమంతరావు, తుడిమెళ్ల మల్లికార్జున్ లకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్లలో రూ.3.33 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన





- నూతన కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి

పటాన్‌చెరు, నవంబర్ 18, మీ వార్త ప్రతినిధి:





ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.బుధవారం అమీన్‌పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వడకపల్లి, పటేల్‌గూడ, ఎన్ఎస్ఎల్ కాలనీ, మండే మార్కెట్, తులసి వనం కాలనీలలో రూ. 3.33 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ అంజిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో వేగంగా విస్తరిస్తున్న నూతన కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీల సంక్షేమ సంఘాలు, స్థానిక ప్రజలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని, అభివృద్ధితో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధుల సహకారంతోనూ నూతన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని వివరించారు.పటాన్‌చెరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రజల సహకారంతో ముందుకు సాగుతామని, ప్రతి డివిజన్‌లో స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ డిప్యూటీ కమిషనర్ లలితా శ్రావణి, అమీన్‌పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్, డీఈ వెంకటరమణ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు తులసి రెడ్డి, చంద్రశేఖర్, యునిస్, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, జగదీష్, సునీత రాజేష్ గౌడ్, శ్రీకాంత్, దాసు, యూసఫ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

(నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. సరుకుల సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని, స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. కాగా, గత కొన్ని రోజులుగా నిత్యావసరాలలో కొన్ని రకాల సరుకులను కాంట్రాక్టర్ పంపకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తేగా, ఎప్పటికప్పుడు నిత్యావసరాల కోసం విద్యా శాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులను అందజేయించారు. నిత్యావసరాలు సమకూర్చే కాంట్రాక్ట్ ఏజెన్సీని సంప్రదించి సరుకులు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో





ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు ఇచ్చి బ్లాక్ లిస్టులో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు.

కాగా, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించకూడదని ఆదేశించారు. ఇంటర్ మీడియట్ విద్యార్థినులకు నీట్ కోచింగ్ అందిస్తుండడం పట్ల కలెక్టర్ అభినందిస్తూ, అత్యధిక మందికి ప్రవేశాలు లభించేలా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా కేజీబీవీ విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి భేటీ అయ్యారు. వారికి పలు ప్రశ్నలు వేస్తూ అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు.

తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ఎంఈఓ సత్యనారాయణ, కేజీవీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు ఉన్నారు.

వైద్య శాఖ కార్యక్రమాల పనితీరు మెరుగుపడాలి!

- ఆభా కార్డుల జనరేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి
- ప్రతిరోజూ కనీసం 200 ఆభా కార్డుల జారీ లక్ష్యం
- 108 అంబులెన్స్ సేవల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల సంఖ్య పెంచాలి
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :

వనపర్తి టౌన్ న్యూస్ : జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో అమలవుతున్న అన్ని కార్యక్రమాల పనితీరును మరింత మెరుగుపరచాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వివిధ కార్యక్రమాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు.

జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆభా (ఆభ) కార్డుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని,



ప్రతిరోజూ కనీసం 200 ఆభా కార్డులు జనరేట్ చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా 108 అంబులెన్స్ సేవల వినియోగాన్ని పెంచాలని, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులు ఈ సేవలను సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల సంఖ్యను పెంచి, వ్యాధులను ముందస్తుగా గుర్తించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ముందస్తు గుర్తింపు ద్వారా బాధితులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. టీ-హబ్ ద్వారా రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు



అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో అమలవుతున్న ప్రతి కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనితీరులో ఆశించిన పురోగతి సాధించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర మోహన్, డిస్టిక్ ట్రాన్స్పోర్ట్ ఆఫీసర్ (డిటీఓ)సురేష్ కుమార్,ఇతర వైద్య శాఖ అధికారులు పాల్గొన్నారు...

అగ్నిప్రమాదం జరిగిన చోటే మళ్లీ భారీ షెడ్డు...!

- ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నా చర్యలేవి...?
- డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ ఏమైందంటూ రామకృష్ణ నగర్ వాసుల నిలదీత!

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 18 (మన మీ వార్త)

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్,చెంగిచర్ల డివిజన్ రామకృష్ణ నగర్‌లో మున్సిపల్ నిబంధనలు నీరుగారిపోతున్నాయి.ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని తెలిసినా,కళ్లముందే నిబంధనలకు విరుద్ధంగా భారీ షెడ్డు నిర్మాణం పూర్తవుతున్నా డిప్యూటీ కమిషనర్ స్పందించకపోవడంపై స్థానికులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గతంలో భారీ అగ్నిప్రమాదానికి గురైన స్థలంలోనే,ఇప్పుడు అంతకంటే భారీ షెడ్డు నిర్మాణం దాదాపు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతుండటంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు.డిప్యూటీ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యవేక్షణ ఏమైందని స్థానికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా డిప్యూటీ కమిషనర్?

సుమారు నాలుగు నెలల క్రితం ఇదే స్థలంలో ఉన్న షెడ్డులో భారీ అగ్నిప్రమాదం సంభవించి నిర్మాణం పూర్తిగా దగ్ధమైంది.నాడు అదృష్టవశాత్తూ ప్రాణనష్టం తప్పడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు.ఇలాంటి ఘటన మరోసారి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత బోడుప్పల్ సర్కిల్ అధికారులపై ఉంది.అయినప్పటికీ,అదే స్థలంలో మరింత భారీ షెడ్డు వెలుస్తున్నా డిప్యూటీ కమిషనర్ దృష్టి



సారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఏదైనా పెను ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు చేపట్టడం కంటే,ముందుగానే నివారించడం అధికారుల బాధ్యత కాదా అని స్థానికులు నిలదీస్తున్నారు.

డిప్యూటీ కమిషనర్‌కు కనిపించని హెచ్చరిక బోర్డులు!

ఇది పూర్తిగా నివాస ప్రాంతమని (రెసిడెన్షియల్ జోన్),ఇక్కడ ఎలాంటి కొత్త షెడ్లు నిర్మించవద్దని,కేవలం నివాస గృహాలు మాత్రమే నిర్మించుకోవాలని రామకృష్ణ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ముందుగానే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసింది.సామాన్యులకు స్పష్టంగా కనిపిస్తున్న ఈ హెచ్చరిక బోర్డులు,బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న డిప్యూటీ కమిషనర్‌కు మరియు టౌన్ ప్లానింగ్ అధికారులకు మాత్రం కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది.సామాన్య ప్రజలు చిన్న నిర్మాణం చేపడితేనే అనుమతుల పేరుతో నోటీసులు జారీ చేసే యంత్రాంగం,నివాస ప్రాంతంలో ఇంత భారీ షెడ్డు నిర్మాణం పూర్తవుతున్నా ఎందుకు మౌనంగా



ఉంటున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు,భద్రతపై స్పష్టత ఏది? నివాస ప్రాంతంలో వాణిజ్య లేదా పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడేలా భారీ షెడ్డు నిర్మాణానికి అసలు అనుమతులు ఉన్నాయా? అగ్నిమాపక భద్రతా నిబంధనలు పాటించారా? జోనింగ్ నిబంధనలు ఇలాంటి నిర్మాణాలకు అనుమతిస్తున్నాయా?అనే అంశాలపై డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు..

డిప్యూటీ కమిషనర్ తక్షణమే క్షేత్రస్థాయికి రావాలి:

స్థానిక అధికారుల ఉదాసీన వైఖరితో విసిగిపోయిన రామకృష్ణ నగర్ వాసులు,డిప్యూటీ కమిషనర్ తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.నిర్మాణం గృహప్రవేశానికి సిద్ధమవుతున్న తరుణంలో డిప్యూటీ కమిషనర్,జోనల్ కమిషనర్ మరియు మున్సిపల్ కమిషనర్ నేరుగా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.తక్షణమే క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన జరిపి,నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఈ షెడ్డుపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని,భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి వలసలు!

- వనపర్తి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు నాయకుల చేరిక
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :

హైదరాబాద్ న్యూస్ : తెలంగాణ రాజ్యాధికార పార్టీలో నూతన చేరికలు కొనసాగుతున్నాయి. వనపర్తి జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాకు చెందిన పలువురు నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు.ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో గోపాల్‌పేట మండలానికి చెందిన మాజీ సర్పంచ్ సోదరుడు నర్సింలు, కడుకుంట్ల గ్రామానికి చెందిన బీసప్ప, నిర్మల ముదిరాజ్ తదితరులు ఉన్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు విజయ్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్తూ, మరింత మంది నాయకులు, కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా నాయకులు మహేందర్, భీమేష్, బాలదాసు, గోపాల్‌పేట నాయకుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు...





సురక్షిత్ జిల్లా" గుర్తింపు సాధించిన వరంగల్ జిల్లా - - జిల్లా కలెక్టర్‌కు ఘన సన్మానం.



మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి ఇందిర చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్యశారద గారికి సన్మానం

వరంగల్ జిల్లా18 నవంబర్ 2026

ఎచ్ ఐ వి/ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణలో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (చీూజూ) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాలను విజయవంతంగా సాధించి వరంగల్ జిల్లా ప్రతిష్టాత్మకమైన "సురక్షిత్ జిల్లా (రాబఝీఎంష్ట్రఱ్ ణఅర్‌తీఅష్)" గుర్తింపును సాధించింది.

ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (ఖూజూ) ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ విద్యాసాగర్ గారి ఆదేశాల మేరకు, జిల్లా సాధించిన ఈ విజయానికి గుర్తింపుగా నేడు స్థానిక కలెక్టరేట్‌లో వరంగల్ జిల్లా గౌరవ కలెక్టర్ శ్రీమతి సత్యశారద గారిని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి ఇందిర గారు జ్ఞాపిక మరియు శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి సత్యశారద గారు మాట్లాడుతూ, జిల్లాకు సురక్షిత్ జిల్లా గుర్తింపు రావడం అన్ని శాఖల అధికారులు మరియు వైద్య ఆరోగ్య సిబ్బంది సమిష్టి కృషి, అంకితభావం మరియు సమన్వయంతోనే సాధ్యమైందని పేర్కొన్నారు.

ఈ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత పట్టుదలతో కృషి చేసి "సురక్షిత్ ప్లస్ (రాబఝీఎంష్ట్రఱ్ రాశ్రీబం)" స్థాయిని సాధించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. బి.రాజారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కృష్ణవేణి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీమతి స్వప్న మాధురి, అకౌంటెంట్ కమలాకర్, నాగరాజు, సహయోగి మంజుల, ఎన్ జి ఓ ప్రతినిధులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు...

ఓజేటీ శిక్షణతో విద్యార్థులకు ఉజ్వల ఉపాధి అవకాశాలు :డీఐఈఓ డా. శ్రీధర్ సుమన్



నర్సంపేట, నవంబర్ 18(మల్లేష్ మీ వార్త ప్రతినిధి) :

ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సుల్లో భాగంగా నిర్వహించే ఆన్ జాబ్ ట్రైనింగ్ (ఓజేటీ) ద్వారా విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాలు పెంపొందడంతో పాటు భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డా. శ్రీధర్ సుమన్ అన్నారు.

బుధవారం నర్సంపేట పట్టణంలోని పలు ఆసుపత్రులను సందర్శించిన ఆయన, ఎస్.ఆర్. ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు చేపడుతున్న ఓజేటీ శిక్షణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పనితీరు, హాజరు పట్టికలు, రోజువారీ శిక్షణ రికార్డులు, ప్రాక్టికల్ అనుభవాలను సమీక్షించారు.ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల ప్రకారం ఒకేషనల్ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ తప్పనిసరి అని తెలిపారు. ఓజేటీలో విద్యార్థులు పొందిన అనుభవాలు, సమర్పించిన రికార్డుల ఆధారంగా మార్కులు కేటాయిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు.

ఆసుపత్రుల్లోని ఓపీ వార్డు, క్రిటికల్ కేర్ వార్డు, ల్యాబొరేటరీలు, రిపోర్టింగ్ సెల్, ఐసీయూ తదితర విభాగాల్లో విద్యార్థులు పొందుతున్న శిక్షణను పరిశీలించి పలు సూచనలు చేశారు. శిక్షణ సమయంలో ఆసక్తి, క్రమశిక్షణతో వ్యవహరిస్తూ ప్రతిరోజూ నేర్చుకున్న అంశాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఆర్. ఒకేషనల్ జూనియర్ కళాశాల చైర్మన్ కొయ్యడి సనత్ కుమార్, ప్రిన్సిపాల్ కొయ్యడి శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, రమేష్ నాయక్, వెంకన్న, నాగేష్, కుమార్, దేవసింగ్, హరిభూషణ్, ప్రవీణ్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శంకు,చక్రం మరియు త్రినామం ఆకృతిలో కార్తీక దీపోత్సవం





శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (18):

మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో ఉన్న చాకరిమెట్ల ఆంజనేయస్వామి దేవాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని బుధవారం తెల్లవారుజామున కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఆలయ పూజారి ప్రభురాజు శర్మ ఆధ్వర్యంలో భక్తులు శంకు, చక్రం,త్రినామం ఆకృతుల్లో దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీకమాస పవిత్రతను చాటుతూ నిర్వహించిన ఈ దీపోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులు దీపారాధన చేసి మొక్కులు సమర్పించుకున్నారు. దీంతో ఆలయ భక్తి భావం వాతావరణం నెలకొంది.

శంభునికుంట చుట్టూ ఉన్న కాలనీలను దోమల బెడద నుంచి కాపాడండి!

- డ్రైనేజీ నీరు, పేరుకుపోయిన చెత్తతో కంపుకొడుతున్న శంభునికుంట
- ప్రజల ఇబ్బందులు అధికారులకు పట్టవా? తక్షణమే పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి: సీపీఎం నాయకులు నాయిని నరసింహారెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 18, మీ వార్త ప్రతినిధి:



బీరంగూడ ప్రాంతంలోని శంభునికుంట డ్రైనేజీ నీరు, పేరుకుపోయిన చెత్తాచెదారంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం నాయకులు నాయిని నరసింహారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.బతుకమ్మ, వినాయక చవితి, దసరా, దుర్గామాత నవరాత్రుల సందర్భంగా పూలు, విగ్రహాల నిమజ్జనం ద్వారా చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించినప్పటికీ, వాటిని ఇప్పటివరకు అక్కడి నుంచి పూర్తిస్థాయిలో తరలించకపోవడంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని తెలిపారు.ముఖ్యంగా జయలక్ష్మీనగర్, సాయికాలనీతో పాటు బీరంగూడ ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే ప్రజలు దుర్వాసన, దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దోమల కారణంగా ప్రజలు విషజ్వరాల బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.శంభునికుంట సమీపంలోని ఆలయం, పార్కుకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వందలాది మంది పిల్లలు, మహిళలు, వృద్ధులు వస్తుంటారని, అయితే చెరువు పరిసరాల్లో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం కారణంగా ప్రశాంతంగా గడపలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దుర్వాసన భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోందని, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి వెంటనే స్పందించాలని, శంభునికుంటలో పేరుకుపోయిన చెత్తాచెదారం, నిమజ్జన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, డ్రైనేజీ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. దోమల నివారణకు ఫాగింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి చుట్టుపక్కల కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సీపీఎం నాయకులు నాయిని నరసింహారెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు.

అర్హులందరికీ పింఛన్లు అందించడమే లక్ష్యం,మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్!

- కౌన్సిలర్‌గా గెలిచిన కొద్ది రోజులకే వార్డు ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయించడంపై ప్రజల హర్షం
- 23వ వార్డులో నూతన పింఛన్ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేసిన కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :





వనపర్తి టౌన్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ 23వ వార్డు కౌన్సిలర్ పలుస శ్రీకర్ గౌడ్ ముందుకు సాగుతున్నారు. వార్డులో నూతనంగా పింఛన్లు మంజూరైన అర్హులైన లబ్ధిదారులకు ఆయన ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కౌన్సిలర్‌గా ఎన్నికైన కొద్ది రోజుల వ్యవధిలోనే వార్డులో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి పింఛన్లు మంజూరయ్యేలా కృషి చేయడం పట్ల వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికైన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం, ముఖ్యంగా వృద్ధులు, నిరుపేదలు, ఆసరా అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు అర్హులైన పేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసానిస్తాయని, వాటి ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుందని ఈ సందర్భంగా కౌన్సిలర్ తెలిపారు. వార్డులో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, వార్డులోని ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి కృషి చేయడమే తన బాధ్యత అని పలుస శ్రీకర్ గౌడ్ పేర్కొన్నారు.కౌన్సిలర్‌గా గెలిచిన కొద్ది రోజులకే పింఛన్లు మంజూరు చేయించడంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ పలుస శ్రీకర్ గౌడ్‌కు అభినందనలు తెలియజేశారు...

పదేళ్ల నిరీక్షణకు తెర.. అర్హులకు పింఛన్ల ప్రాసెసింగ్ కాపీలు!

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాలతో అర్హులకు పింఛన్ల మంజూరుకు ముందడుగు
- వితంతువులు, దివ్యాంగులకు నూతన పింఛన్ల ప్రాసెసింగ్ కాపీల అందజేత
- పదేళ్ల కల నెరవేరిందంటూ సంతోషం వ్యక్తం చేసిన వంగరావుపు కాలనీ ప్రజలు
- 28వ వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి చొరవపై హర్షం

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త



వనపర్తి టౌన్ న్యూస్ : అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందినప్పుడే నిజమైన ప్రజాసేవకు సార్థకత చేకూరుతుందని నిరూపించేలా వనపర్తి పట్టణంలోని 28వ వార్డులో పింఛన్ల ప్రక్రియ ముందుకు సాగుతోంది. వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు వంగరావుపు కాలనీలో అర్హులైన వితంతువులు, దివ్యాంగులకు నూతన పింఛన్ల ప్రాసెసింగ్ కాపీలను 28వ వార్డు కౌన్సిలర్ కోట్ల శిరీష రవి అందజేశారు.
ఎన్నో ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఈ ప్రక్రియ ద్వారా ఆశలు చిగురించాయి. ముఖ్యంగా సుమారు పదేళ్లుగా ఎదురుచూస్తున్న తమ కల నెరవేరే దిశగా అడుగులు పడటంతో కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ...తమ సమస్యలను గుర్తించి, పింఛన్ల ప్రక్రియ ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కౌన్సిలర్ కోట్ల శిరీష రవికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమకు ఇప్పుడు ఆశ కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు.ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపినప్పుడే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులకు చేరుతాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయడం అభినందనీయమని కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు...

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి!

- ఎన్హెచ్ -44పై ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల నివారణకు ప్రత్యేక దృష్టి
- పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి
- పోక్సో కేసులను 60 రోజుల్లోగా పూర్తి చేయాలి
- సైబర్ నేరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
- కొత్తకోట సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఐపిఎస్

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :





వనపర్తి జిల్లా,కొత్తకోట న్యూస్ : ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, బాధితులకు సత్వర న్యాయం అందించడంలో ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.బుధవారం జిల్లా ఎస్పీ కొత్తకోట సర్కిల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల దర్యాప్తు, పోలీస్ రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమీక్షించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తరచూ పోలీస్ స్టేషన్లను సందర్శిస్తూ సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు.కొత్తకోట సర్కిల్ పరిధిలోని ఎన్హెచ్ -44 జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల తనిఖీలు, రోడ్డు భద్రతా నిబంధనల అమలుపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. హైవే పరిసర గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు జరగకుండా రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు.పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, పెండింగ్ కేసులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారులకు సంబంధించిన పోక్సో కేసుల్లో 60 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ కేసుల్లో సాంకేతిక ఆధారాలను సేకరించి, విచారణను వేగవంతం చేయాలని సూచించారు.క్రైమ్ మ్యాప్ ఆధారంగా నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, పాపిలాన్ పరికరాన్ని సమర్థవంతంగా వినియోగించి నేరస్తుల గుర్తింపు, దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని ఆదేశించారు. బాధితులు ఏ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో నిర్లక్ష్యం చేయకూడదని స్పష్టం చేశారు. కోర్టు విధులు నిర్వహించే అధికారులు చార్జిషీట్లు, సాక్షుల హాజరు, కేసుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓర్పుగా విని సకాలంలో స్పందించాలని సూచించారు. అకతాయిలు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడేవారు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, చోరీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి విజ్ఞప్తి చేశారు...

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే లక్ష్యం!

- జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ఒకేసారి పథకం ప్రారంభం
- రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు.. ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తుల సేకరణ
- ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ అదర్శ్ సురభి ఆదేశాలు

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :





వనపర్తి టౌన్ న్యూస్ : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో పండుగ వాతావరణంలో ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో ఒకేసారి ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని, రాబోయే రెండు వారాల పాటు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలని సూచించారు.బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు, ప్రారంభోత్సవ ఏర్పాట్లు, దరఖాస్తుల సేకరణ, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్, (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 19వ తేదీ సాయంత్రం సిద్దిపేట జిల్లా నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లోని వార్డుల్లో పథకాన్ని ఒకేసారి ప్రారంభించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.పథకం ప్రయోజనాలు ప్రతి కుటుంబానికి అందేలా రాబోయే రెండు వారాల పాటు గ్రామాలు, మున్సిపల్ వార్డుల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సీఎస్ సూచించారు. ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు సేకరించి, బీమా పొందే వ్యక్తి వివరాలు, నామినీ వివరాలు తదితర సమాచారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు.
పథకం ఉద్దేశం, ప్రయోజనాలు, దరఖాస్తు విధానంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామాల్లో మైక్ ప్రచారం, పోస్టర్లు, కరపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా పథకం వివరాలను ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో పథకం ప్రారంభోత్సవానికి, ప్రత్యేక శిబిరాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల వారీగా కార్యాచరణ రూపొందించి స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు.ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తు సేకరించేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని, దరఖాస్తుల నమోదులో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రామ్ రెడ్డి, డీఆర్డీఓ ఉమాదేవి, సీపీఓ హరికృష్ణ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు...

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ రేసులో ప్రముఖ మహిళా నేత మచ్చ వరలక్ష్మి!

- పద్మశాలి,మహిళా కోటాల్లో బలంగా వినిపిస్తున్న పేరు..
- కష్టకాలంలో పార్టీ జెండా మోసిన నాయకురాలిగా గుర్తింపు!

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 18 (మన మీ వార్త)



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర ఉత్కంఠ రేపుతున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాల భర్తీ ప్రక్రియలో బోడుప్పల్‌కు చెందిన సీనియర్ మహిళా నేత మచ్చ వరలక్ష్మి పేరు ప్రముఖంగా తెరపైకి వచ్చింది.పార్టీలో ఖాళీ అవుతున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలను'రెండు బీసీ, ఒక ఎస్సీ'(2 BC G 1 SC) ఫార్ములాతో భర్తీ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తుండగా,పద్మశాలి మరియు మహిళా కోటా కింద ఈమె పేరు పరిశీలనలో ఉంది.

పద్మశాలి,మహిళా కోటాలో బలమైన ప్రాతినిధ్యం: గతంలో సిరిసిల్లలో నిర్వహించిన బహిరంగ సభలో పద్మశాలి సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ నేపథ్యంలో,ఆ వర్గానికి చెందిన నేతలకు ప్రాధాన్యత లభిస్తోంది.ఈ రేసులో పలువురు సీనియర్ల పేర్లు వినిపిస్తున్నప్పటికీ, శాసనమండలిలో బీసీ మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే వాదన తెరపైకి రావడంతో మచ్చ వరలక్ష్మి పేరుకు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉద్యమ పోరాటాలుడ గ్రేటర్ అనుభవం:

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు మచ్చ వరలక్ష్మి క్రియాశీలక పాత్ర పోషించారు.రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా,గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె చేసిన సేవలు పార్టీలో గుర్తింపు తెచ్చాయి.నాటి ప్రభుత్వ విధానాలపై గ్రేటర్ పరిధిలో జరిగిన అనేక నిరసనలు,పోరాటాల్లో ముందుండి నడిచారు.

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు మరియు ఖైరతాబాద్ ఉపఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ సామాజిక సమీకరణాలను మారుస్తున్న తరుణంలో,మచ్చ వరలక్ష్మి లాంటి పట్టున్న మహిళా నేతకు అవకాశం కల్పిస్తే పద్మశాలి ఓటు బ్యాంకుతో పాటు మహిళా ఓటర్లను బలంగా ఆకట్టుకోవచ్చని పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. హేమాహేమీల పోటీ మధ్య సాగుతున్న ఈ గవర్నర్ కోటా పోరులో లక్కీ ఛాన్స్ ఎవరికి దక్కుతుందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

హెచ్ఐవీ నియంత్రణలో వనపర్తికి రాష్ట్రస్థాయి గుర్తింపు!

- 95-95-95 లక్ష్యాల సాధనలో మెరుగైన ప్రగతి

- రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 'సురక్షిత్' కేటగిరీకి వనపర్తి ఎంపిక

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని అభినందించిన టీజిఎస్ఎసిఎస్ డిప్యూటీ డైరెక్టర్ పి. మేఖల

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :

వనపర్తి టౌన్ న్యూస్ : హెచ్ఐవీ నివారణ, నియంత్రణ కార్యక్రమాల్లో మెరుగైన ప్రగతి సాధించిన వనపర్తి జిల్లాకు 'సురక్షిత్' జిల్లా గుర్తింపు లభించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. ఈ గుర్తింపును కొనసాగిస్తూ భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో వనపర్తి జిల్లా మెరుగైన ప్రగతి కనబరిచి 'సురక్షిత్' కేటగిరీకి ఎంపికైంది. నాకో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మాన్ సమారోహ్' కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఈ కేటగిరీకి ఎంపికైన 20 జిల్లాల్లో వనపర్తి జిల్లా చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (టీజిఎస్ఎసిఎస్) డిప్యూటీ డైరెక్టర్ పి. మేఖల బుధవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.ఈ సందర్భంగా హెచ్ఐవీ నియంత్రణలో సాధించిన





ప్రగతిని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నాకో నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల్లో భాగంగా హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి తమ వ్యాధి స్థితిపై అవగాహన కల్పించడం, వ్యాధి నిర్ధారణ అయిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఎఆర్టీ) చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందికి వైరల్ సప్రెషన్ సాధించడం ప్రధాన లక్ష్యాలని తెలిపారు.ఈ మూడు ప్రమాణాల ఆధారంగా జిల్లాల పనితీరును అంచనా వేసి సురక్షిత్, సక్షమ్, సంఘర్షశీల్ విభాగాలుగా గుర్తిస్తున్నట్లు వివరించారు. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, ఐసీటీసీ, ఏఆర్టీ, సిఎస్సీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో పనిచేయడం వల్లే వనపర్తి జిల్లాకు ఈ గుర్తింపు లభించిందని డిప్యూటీ డైరెక్టర్ పి. మేఖల తెలిపారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ హెచ్ఐవీ నియంత్రణలో జిల్లాకు గుర్తింపు రావడం సంతోషకరమని అన్నారు. ఈ ప్రగతిని కొనసాగిస్తూ హెచ్ఐవీ నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలను పెంచాలని సూచించారు. హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి సకాలంలో చికిత్స అందించడంతో పాటు నిరంతర వైద్య సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాకు ఈ గుర్తింపు రావడానికి కృషి చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. భాస్కర్ నాయక్‌తో పాటు వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఆర్టీ కేంద్రాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పనిచేస్తూ హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. భాస్కర్ నాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్ర మోహన్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ, డిషా సిబ్బంది, సీపీఓ, ఐసీటీసీ, పీపీఐసీటీసీ, డీఎస్ఆర్సీ కౌన్సిలర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, హోప్ ఎన్జీవో బృందం, ఏఆర్టీ బృందం, సిఎస్సీ కోఆర్డినేటర్లు, లింక్ వర్కర్స్ స్కీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు...

వరంగల్ జిల్లా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- సామాజిక భద్రతకు పెద్దపీట.. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- వర్ధన్నపేట నియోజకవర్గంలో 2,161 మందికి చేయూత పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండ అంబేద్కర్ భవన్లో లబ్ధిదారులకు చేయూత పింఛన్ పత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ హనుమకొండ, జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారదచాహత్ బాజ్ పాయి,సమాజంలోని పేదలు, నిరుపేదలు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతూ, వారికి ఆర్థిక భరోసా కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు అన్నారు.
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.
బుధవారం సాయంత్రం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో గ్రేటర్ వరంగల్ పరిధిలోని వర్ధన్నపేట నియోజకవర్గ లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి , జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్నలతో కలిసి లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తోందన్నారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, సమాజంలోని అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని కొనియాడారు.
సామాజిక భద్రత ప్రతి ఒక్కరి హక్కు అనే లక్ష్యంతో ప్రభుత్వం చేయూత పింఛన్ల పంపిణీకి శ్రీకారం





చుట్టిందని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత వృత్తులపై ఆధారపడిన వారికి ఆర్థిక చేయూత అందించడం అభినందనీయమన్నారు. పింఛన్లు కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా, అర్హులైన లబ్ధిదారులకు ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు.
గ్రేటర్ వరంగల్ పరిధిలోని వర్ధన్నపేట నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 2,161 మంది లబ్ధిదారులకు నూతనంగా చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. వీరిలో 1,426 మంది వితంతువులు, 478 మంది దివ్యాంగులు, 139 మంది కల్లుగీత కార్మికులు, 5 మంది చేనేత కార్మికులు, 20 మంది అవివాహిత ఒంటరి మహిళలు, 93 మంది వివాహిత ఒంటరి మహిళలు ఉన్నారు.
అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పింఛన్లు మంజూరు చేయడం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.
కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లుగా ఎదురుచూస్తున్న అర్హులకు పింఛన్లు అందించడం అభినందనీయమని, ఇందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ఆరు గ్యారంటీల అమలుతో పాటు పేదలకు సన్నబియ్యం, , మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
అదేవిధంగా ఈ నెల 19వ తేదీ నుంచి ప్రతి కుటుంబ పెద్దకు రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయడం పేద కుటుంబాలకు ఎంతో భరోసానిస్తుందని పేర్కొన్నారు.
ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాకు మొత్తం 11,750 నూతన చేయూత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో గ్రేటర్ వరంగల్ పరిధిలోని మూడు వార్డులకు సంబంధించి వర్ధన్నపేట నియోజకవర్గంలో 1,386 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల ఖాతాల్లో రూ.34 లక్షలు జమ చేసినట్లు, ప్రతి నెలా క్రమం తప్పకుండా పింఛన్లు అందజేస్తామని తెలిపారు. అధికారుల సమన్వయంతో అన్ని కేటగిరీల అర్హులకు పింఛన్లు అందిస్తున్నామని, అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.
ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు వివిధ విధాలుగా ప్రయోజనం కలుగుతోందని తెలిపారు. ఈ పథకాల ద్వారా వారు ఆర్థికంగా పురోగతి సాధిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు వంటి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. అర్హులు సంబంధిత పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెన్షన్ పొందిన లబ్ధిదారులకు ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. పింఛన్లు నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బల్దియా ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, హనుమకొండ జిల్లా డీఆర్‌డీఏ మేన శ్రీను, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

వైకల్యం శరీరానికే.. నైపుణ్యానికి, సామర్థ్యానికి కాదు!

- 90 శాతం వైకల్యాన్ని అధిగమించి పారిశ్రామికవేత్తగా ఎదిగిన చంద్రకాంత్ సాగర్

- దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్న చంద్రకాంత్ సాగర్‌పై మాజీ మంత్రులు కేటీఆర్, నిరంజన్ రెడ్డి ప్రశంసలు

- తెలంగాణ భవన్‌లో ఆత్మీయ భేటీ, స్వయంకృషి ఫౌండేషన్ లోగో ఆవిష్కరణ

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :

హైదరాబాద్ న్యూస్ : శారీరక వైకల్యం మనిషి నైపుణ్యానికి, సామర్థ్యానికి అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం, పట్టుదల, స్వయంకృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని మాజీ మంత్రులు కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్), సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. 90 శాతం శారీరక వైకల్యం ఉన్నప్పటికీ ఎన్నో సవాళ్లను అధిగమించి పారిశ్రామికవేత్తగా ఎదగడమే కాకుండా, పలువురు దివ్యాంగులకు ఉపాధి కల్పిస్తున్న ప్రణవ్ ఎంటర్‌ప్రైజెస్ అధినేత చంద్రకాంత్ సాగర్‌ను వారు ప్రత్యేకంగా అభినందించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చంద్రకాంత్ సాగర్‌కు అండగా నిలిచి, ఆయన పరిశ్రమ అభివృద్ధికి సహకరించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను చంద్రకాంత్ సాగర్ తెలంగాణ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.ఈ ఆత్మీయ భేటీలో చంద్రకాంత్ సాగర్ పారిశ్రామిక ప్రస్థానం, ఎదుర్కొన్న సవాళ్లు, సాధించిన విజయాల గురించి కేటీఆర్, నిరంజన్ రెడ్డి ఆత్మీయంగా మాట్లాడారు. శారీరక వైకల్యాన్ని అధిగమించి స్వయంకృషి, పట్టుదలతో పారిశ్రామికవేత్తగా ఎదగడమే కాకుండా, తన పరిశ్రమ ద్వారా ఇతర దివ్యాంగులకు





ఉపాధి కల్పించడం అభినందనీయమని కొనియాడారు.అనంతరం చంద్రకాంత్ సాగర్ స్థాపించిన స్వయంకృషి ఫౌండేషన్ లోగోను మాజీ మంత్రులు కేటీఆర్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మీయంగా కలిసి భోజనం చేశారు.వైకల్యం ఉన్నప్పటికీ ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే సాధించలేనిది ఏదీ లేదని చంద్రకాంత్ సాగర్ నిరూపించారని, ఆయన ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని మాజీ మంత్రులు అభిప్రాయపడ్డారు...

రైతుల సంక్షేమమే లక్ష్యం.. వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభం!

- పామిరెడ్డిపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు

- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ మధిర మంజుల

- రైతులకు మద్దతు ధర అందించేందుకు కొనుగోలు కేంద్రం దోహదం

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :





వనపర్తి జిల్లా,పామిరెడ్డిపల్లి న్యూస్ : రైతులకు అండగా నిలుస్తూ, వారు పండించిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా కొనుగోలు కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని సర్పంచ్ మధిర మంజుల అన్నారు.పామిరెడ్డిపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ మధిర మంజుల, శ్రీశైలం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించి కొనుగోలు కేంద్రం కార్యకలాపాలను ప్రారంభించారు.
ఈ కొనుగోలు కేంద్రం అందుబాటులోకి రావడంతో గ్రామంలోని రైతులకు ధాన్యం విక్రయించేందుకు సౌకర్యం కలగనుంది. రైతులు పండించిన పంటను విక్రయించేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు సమయం, రవాణా ఖర్చులు ఆదా కానున్నాయి.రైతులు కొనుగోలు కేంద్రంలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని, ధాన్యం విక్రయించే సమయంలో అవసరమైన నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు.రైతుల కష్టానికి తగిన ప్రతిఫలం దక్కేలా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు సహకరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు, మహిళలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు...

మహిళా భవనానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే సునీత రెడ్డి

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (18):

మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో మహిళా సమైక్య భవన నిర్మాణ పనులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి శ్రీకారం చుట్టారు.ఉపాధి హామీ (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో నిర్మించనున్న మహిళా సమైక్య భవనానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల కార్యకలాపాలకు భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని,మహిళలు సంఘటితంగా ముందుకు సాగేందుకు ఇలాంటి నిర్మాణాలు దోహదపడతాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారి సమావేశాలు,వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగపడనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు అనంతరం లబ్ధిదారులకు మంజూరైన పెన్షన్ మంజూరు పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీద అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ,మన్సూర్ గ్రామ సర్పంచ్ కోమరయ్య, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అచ్చా విద్యాసాగర్ మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ సంతాపం

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అచ్చా విద్యాసాగర్ గారి మృతి పట్ల గ్రేటర్ వరంగల్ తొలి మేయర్ ,వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ తీవ్ర దిగ్భ్రాంతి, ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.
గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అచ్చా విద్యాసాగర్ హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారని నన్నపునేని నరేందర్ తెలిపారు.
విద్యాసాగర్ కుటుంబ సభ్యులకు నన్నపునేని నరేందర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

సూర్యాపేట పట్టణంలో రోడ్డు ఆక్రమణల తొలగింపు.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

- ఆపరేషన్ రోప్‌లో భాగంగా రోడ్లపై ఆక్రమణలను తొలగించిన ట్రాఫిక్ పోలీసులు

మీ వార్త నవంబర్ 18 సూర్యాపేట జిల్లా ప్రతినిధి



సూర్యాపేట పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ,వాహనదారులు, పాదచారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు ఆపరేషన్ రోప్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టారు.
పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంగణంలో రోడ్లపైకి వచ్చి స్థలాన్ని ఆక్రమించిన దుకాణదారుల ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు దుకాణాల ముందు రోడ్డుపైకి వచ్చిన వస్తువులను లోపలికి సర్దుకునేలా సూచించి, రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నారు.
రోడ్లపై ఆక్రమణల వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటమే కాకుండా వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగుతాయని, ప్రమాదాలకు కూడా అవకాశం ఉంటుందని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు. రహదారులను ఆక్రమించకుండా, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని దుకాణదారులకు సూచించారు.
పట్టణంలో ట్రాఫిక్ సజావుగా సాగేందుకు, ప్రజల ప్రయాణం సురక్షితంగా ఉండేందుకు ఆక్రమణల తొలగింపు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

భర్త మృతి చెంది ఏడాది గడుస్తున్నా అందని పెన్షన్

-పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధురాలు

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (18):



భర్త మృతి చెంది ఏడాది గడుస్తున్నా వితంతు పెన్షన్ మంజూరు కాకపోవడంతో ఓ వృద్ధురాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. పెన్షన్ కోసం అధికారుల చుట్టూ తిరుగుతూ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం బిజిలిపూర్ గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మి భర్త శంకరయ్య ఏడాది క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి తనకు రావాల్సిన పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి రెండుసార్లు దరఖాస్తు పత్రాలు అందజేసింది. అయినప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ మంజూరు కాకపోవడంతో ఆమె నిరాశకు గురవుతోంది.

పెన్షన్ కోసం మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకే చేతిలో సంచి,మరో చేతికి కర్ర సాయంగా పట్టుకుని ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న లక్ష్మి అధికారుల కోసం ఎదురుచూస్తూ కనిపించింది. వయస్సు మీదపడటంతో పాటు భర్తను కోల్పోయి జీవనాధారం లేక ఇబ్బందులు పడుతున్నానని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే రెండుసార్లు కార్యదర్శికి ,ఒకసారి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకపోవడంతో తన పరిస్థితిని అధికారులు అర్థం చేసుకుని వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని వృద్ధురాలు వేడుకుంటోంది. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడంపై గ్రామస్థులు కూడా విచారం వ్యక్తం చేస్తున్నారు.

నూతన పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

-శివ్వంపేటలో నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల అందజేత



శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (18):

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా మంజూరైన పింఛన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను గ్రామ సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు 1వ వార్డు సభ్యుడు ముయ్యిడి ముత్యాలు2వ వార్డు సభ్యురాలు ఈసారపు ప్రభావతి రాజుగౌడ్, 3వ వార్డు సభ్యుడు పెద్దగోని శ్రీనివాస్ గౌడ్,6వ వార్డు సభ్యురాలు దేవునబోయిన బాలమణి కృష్ణ,7వ వార్డు సభ్యుడు కోలా కిషన్,9వ వార్డు సభ్యురాలు కంలయ్యగారి మల్లేశ్వరి నర్సింలు,10వ వార్డు సభ్యురాలు కొడకంచి స్వాతి గణేష్ గౌడ్,11వ వార్డు సభ్యురాలు రెడ్డిపల్లి స్వరూప అశోక్,12వ వార్డు సభ్యుడు పెద్దకొల విక్రమ్ పాల్గొన్నారు.

అలాగే బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బసంపల్లి రామగౌడ్, మాజీ వార్డు సభ్యులు వంజరి కొండల్, కోవూరి వెంకటేష్, కంలయ్యగారి లక్ష్మీనారాయణ, గ్రామస్థులు ముద్దగల దుర్గేష్, చింతకింది భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ భూసేకరణ అంశంపై ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులతో సమావేశం

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండ జిల్లా పరిధిలో... గౌరవెల్లి ప్రాజెక్టు, కొత్త రైల్వే లైన్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ కు సంబంధించి చేపట్టే భూసేకరణ అంశంపై స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజ్,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు.

బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ సమావేశమై భూ సేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డిఓ వెంకటేష్, కుడా సిపిఓ అజిత్ రెడ్డి, జిడబ్ల్యూఎంసి సిపిఓ రవీంద్ర రెడేకర్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఘనంగా సన్మానం



మీ వార్త నవంబర్ 18 సూర్యాపేట జిల్లా ప్రతినిధి

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో రిటైర్డ్ ఉద్యోగులు శ్యాంసుందర్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి , విజయ్ కుమార్, కిషోర్, రామారావు ,ఉద్యోగులకు ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, హాజరై, పదవీ విరమణ పొందిన ఉద్యోగులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సుదీర్ఘ సేవాకాలంలో అందించిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ విధుల్లో అంకితభావంతో పనిచేసి ప్రజలకు సేవలందించిన ఉద్యోగుల సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం వారు ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్హుడికి సంక్షేమ పథకం అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం!









- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల భరోసా
- వనపర్తి నియోజకవర్గంలో నెలకు రూ.11 కోట్ల పింఛన్ల పంపిణీ
- 5,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించాం,అర్హులందరికీ ఇళ్లు కల్పిస్తాం
- పింఛన్లు, రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో నవంబర్ 18 మీ వార్త :

వనపర్తి జిల్లా,ఖిల్లా ఘణపురం: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. బుధవారం ఖిల్లా ఘణపురం మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ధ్రువీకరణ పత్రాలు, డిజిటల్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో ప్రతి నెలా సుమారు రూ.11 కోట్ల పింఛన్ల పంపిణీ చేస్తూ వేలాది పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గత ప్రభుత్వాల హయాంలో అమలైన ప్రజలకు ఉపయోగపడే పథకాలను కొనసాగిస్తూనే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంపై గత పాలకులు లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ పేదల సంక్షేమానికి ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదని పేర్కొన్నారు. రైతు భరోసా, రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నామని వివరించారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, నవంబర్ 19 నుంచి ఈ పథకం ప్రారంభం కానుందని తెలిపారు. వనపర్తి నియోజకవర్గానికి ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించామని, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించి గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, వ్యాపార అవకాశాలు కల్పిస్తూ మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణ వంటి రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పిస్తోందని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. నీటిని, విద్యుత్‌ను వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. కరువు పరిస్థితులు ఎదురైనా రైతులు, ప్రజలను ఆదుకునేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులపై విమర్శలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతికి అవకాశాలు లేకపోవడంతోనే వారు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సాయిచరణ్ రెడ్డి, ఖిల్లా ఘణపురం మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు నవనీత క్యామ రాజు, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ పద్మమ్మ, మండల అధ్యక్షులు కృష్ణయ్య యాదవ్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సింగిల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, రవి నాయక్, వెంకట్రావు, మురళీధర్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ఆగారం ప్రకాష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

ఆదివాసీ హక్కుల కోసం డిసెంబరు 9న సమరశంఖం!

- లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించడమే ప్రధాన డిమాండ్
- చలో హైదరాబాద్ సభకు గూడేల నుంచి భారీగా తరలిరావాలి
- తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా. మైపతి అరుణ్ కుమార్ పిలుపు

కాసిపేట, నవంబరు 18: (మన మీ వార్త మండల ప్రతినిధి)

ఆదివాసీల అస్తిత్వం, ఆత్మగౌరవం, రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం మరో సమరానికి సిద్ధం కావాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా ఆదివాసులు ఎదుర్కొంటున్న అన్యాయాలు, దోపిడీ, హక్కుల ఉల్లంఘనలను రాష్ట్ర ప్రజానీకం దృష్టికి తీసుకెళ్లేందుకు డిసెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ బహిరంగ సభను వేదికగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఆదివాసీ గూడెం నుంచి ప్రజలు, యువత, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటాలని కోరారు.

బుధవారం మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్‌లో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో పెంద్రం హన్మంతు అధ్యక్షతన నిర్వహించిన ఆదివాసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 50 ఏళ్లుగా ఆదివాసులు ఎదుర్కొంటున్న దోపిడీ, వివక్ష, అన్యాయాలను తెలంగాణ సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జల్--జంగల్--జమీన్‌పై ఆదివాసీల హక్కులను కాపాడటంతోపాటు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు ఐటీడీఏ పరిధిలో సంపూర్ణంగా అమలయ్యేలా ఐక్య పోరాటం సాగించాలని సూచించారు.

ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలి

డిసెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించే చలో హైదరాబాద్ సభలో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌ను ప్రధానంగా వినిపించనున్నట్లు తుడుం దెబ్బ నాయకులు స్పష్టం చేశారు. లంబాడీలకు ఎస్టీ హోదా కల్పించడంపై తమ అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ, ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, విద్యా, ఉద్యోగ అవకాశాలు అసలైన ఆదివాసీలకు అందాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల అస్తిత్వం, హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, భూమి, ఉపాధి సమస్యలపై సభలో తమ గళాన్ని వినిపిస్తామని తెలిపారు.



అరుణ్ కుమార్‌పై ఆరోపణలు అవాస్తవం

తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్‌పై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని రాష్ట్ర కార్యదర్శి జాకే శేఖర్ పేర్కొన్నారు. రాజకీయ పదవులే లక్ష్యంగా ఆయన పనిచేస్తే ఈపాటికే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యే అవకాశం ఉండేదని, అయితే ఆదివాసుల హక్కుల సాధనే ఆయన ప్రధాన లక్ష్యమని అన్నారు. రాజ్యాంగబద్ధమైన హక్కుల అమలు కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

భూములిచ్చిన ఆదివాసులకు పరిశ్రమలో న్యాయం ఏదీ?

దేవాపూర్ ఓరియంట్ అదానీ సిమెంట్ పరిశ్రమ కోసం వేలాది ఎకరాల భూములు కోల్పోయిన ఆదివాసీ కుటుంబాలకు పరిశ్రమలో తగిన న్యాయం జరగడం లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోయిన కుటుంబాలకు న్యాయమైన వాటా కల్పించాలని, చదువుకున్న ఆదివాసీ నిరుద్యోగ యువతకు పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల భూములు, హక్కులు, ఉపాధి సమస్యల పరిష్కారం కోసం తుడుం దెబ్బ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



కుంరం భీం కు నివాళులు.. పరిశ్రమ యాజమాన్యానికి వినతి

సమావేశానికి ముందు దేవాపూర్ లోని కుంరం భీం చౌరస్తా వద్ద రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్‌కు ఆదివాసీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం కుంరం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో జాతీయ అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్, జాతీయ ఉపాధ్యక్షుడు ఆడ జంగు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పుర్క బాపూరావు, రాష్ట్ర కార్యదర్శులు జాకే శేఖర్, సోయం జంగు, మాడవి అనంతరావ్ తదితరులు మాట్లాడారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ఆదివాసీ నాయకులు తమ ప్రాంతాల్లోని సమస్యలను వివరించగా, నాయకులు పలు సూచనలు చేశారు. అనంతరం తుడుం దెబ్బ నాయకులు దేవాపూర్ ఓరియంట్ అదానీ సిమెంట్ పరిశ్రమకు వెళ్లి ఆదివాసుల సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కంపెనీ యాజమాన్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పెంద్రం హన్మంతు, స్థానిక సర్పంచ్ సిదం రాందాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శి కోడప అనిల్ కుమార్, కాసిపేట మండల గౌరవ అధ్యక్షుడు ఆత్రం జంగు, మంచిర్యాల జిల్లా కోలవార్ సంఘం అధ్యక్షుడు ఆత్రం మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం మణికుమార్, యాపల సామయ్య, జిల్లా సర్మెడి కుంరం జనార్దన్, నాయక పోడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొమ్ముల బాపు కుర్సింగ బాబురావ్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు 9న చలో హైదరాబాద్

ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల మద్దతు

ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి ఒకరు తరలిరావాలి



ఆసిఫాబాద్ : ఆదివాసీల హక్కుల సాధన కోసం డిసెంబరు 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆదివాసీ హక్కుల సభకు తొమ్మిది తెగల సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. సభకు ప్రతి ఆదివాసీ కుటుంబం నుంచి కనీసం ఒక్కరు హాజరయ్యేలా గ్రామస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. వాంకిడి మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో బుధవారం తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పంద్రం సురేష్ అధ్యక్షతన చలో హైదరాబాద్ సన్నాహక సమావేశం నిర్వహించారు. తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు తొమ్మిది తెగల ఆదివాసీ సంఘాల నాయకులు సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. 2017లో సరూర్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమం కంటే అధిక సంఖ్యలో ఆదివాసీలు ఈసారి పాల్గొనేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మండలంలోని ప్రతి ఆదివాసీ గ్రామంలో గ్రామ పటేల్‌లు, సర్పంచులు సమావేశాలు ఏర్పాటు చేసి సభ ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని కోరారు.

మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం







- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.63 లక్షల మందికి పెన్షన్లు.. వారిలో 3.50 లక్షల మంది మహిళలే

- ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు వీవో భవనాలు, రూ.10 లక్షలతో వర్క్‌షెడ్లు..మంత్రి సీతక్క

- పరకాల నియోజకవర్గంలో రూ.40.95 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- HAM రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన.. చేయూత పింఛన్ల పంపిణీ, ఇందిరా మహిళా డెయిరీ పాల సేకరణ కేంద్రం శంకుస్థాపన

- పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క, ఎంపీ కడియ కావ్య, మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి,జిల్లా కలెక్టర్ దా. సత్య శారద

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి ప్రతినిధి.

వరంగల్ జిల్లా సంగెం మండలం నవంబర్ 18:
పరకాల నియోజకవర్గంలో రూ.40.95 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దానసరి అనసూయ (సీతక్క) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూావీ పథకం కింద చేపట్టనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, చేయూత పింఛన్ల పంపిణీ, పరకాలలో ఇందిరా మహిళా డెయిరీ పాల సేకరణ కేంద్రం, కేంద్ర భవనాల నిర్మాణాలకు శంకుస్థాపనలు, పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమం లో ముందుగా మంత్రి గారికి పూర్ణకుంభం తో స్వాగతం పలికి జ్యోతి ప్రజ్వలన తో చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.
రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో కొత్తగా 4.63 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని, వారిలో సుమారు 3.50 లక్షల మంది మహిళలు ఉన్నారని వెల్లడించారు.
ఒంటరి మహిళలు, భర్తను కోల్పోయిన మహిళలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు.
పెన్షన్ లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి రాజకీయ జోక్యానికి తావులేకుండా మహిళా సంఘాల భాగస్వామ్యంతో నిజమైన అర్హులను గుర్తించి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని తెలిపారు.
మహిళా సంఘాలకు మౌలిక సదుపాయాలు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో రూ.41 కోట్లకు పైగా రహదారి అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు. రెండు ఎంపీడీవో కార్యాలయ భవనాల నిర్మాణంతో పాటు మహిళా సంఘాల కోసం ఇప్పటికే దాదాపు 400 కు పైగా వీవో గ్రూపులు ఉన్నాయి. 167 కు పైగా భవనాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘాలు సమావేశాలు నిర్వహించుకునేందుకు వీవో భవనాలు నిర్మించుకోవాలని సూచించారు. వీవో భవనాలకు అనుబంధంగా రూ.10 లక్షలతో వర్క్‌షెడ్లు నిర్మాణం కోసం మంజూరు ఇవ్వడం జరుగుతదని వారు అన్నారు. వీటితో పాటు అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో మ్యారేజ్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.
మహిళల పేర్లపైనే ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి సుమారు 6 వేల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా, గతంలో 3,500 ఇళ్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. మంజూరైన ప్రతి ఈ ఇంటిని మహిళల పేరుపై కేటాయించడం ద్వారా వారికి ఆస్తి హక్కు, కుటుంబంలో గౌరవం, ఆర్థిక భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.
మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు.
మహిళా సంఘాలకు రూ.75 వేల కోట్ల బ్యాంకు రుణాలు మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి కుటుంబ అవసరాల కోసం ప్రతి రూపాయికి ఇతరులపై ఆధారపడాల్సిన పరిస్థితి లేకుండా చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి సీతక్క తెలిపారు. గతంలో మహిళా సంఘాలకు రూ.2 లక్షలు, రూ.3 లక్షల బ్యాంకు రుణాలు పొందడం కూడా కష్టంగా ఉండేదని, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు మూడేళ్లలోపే సుమారు రూ.75 వేల కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. ఒక్కో మహిళా సంఘానికి రూ.20 లక్షలకు పైగా రుణాలు అందిస్తున్నామని, అందులో రూ.10 లక్షల వరకు వడ్డీ రాయితీ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. వడ్డీ రాయితీ మొత్తాలను ప్రతి మూడు లేదా ఆరు నెలలకు ఒకసారి మహిళా సంఘాల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు.
మహిళా సంఘాలకు బస్సులతో ఆదాయం
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు మండల సమాఖ్యలకు ఒక్కో బస్సు చొప్పున అందిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలోని బస్సులను ప్రభుత్వం అద్దెకు తీసుకుంటూ ఒక్కో బస్సుకు నెలకు రూ.70 వేల చొప్పున సంబంధిత మండల సమాఖ్య ఖాతాల్లో జమ చేస్తోందని పేర్కొన్నారు.
సోలార్ విద్యుత్ కేంద్రాలు, పెట్రోల్ బంకులతో ఉపాధి
మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా మహిళా సంఘాలు ఆదాయం పొందే అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.
300 ప్రాంతాల్లో ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లు
ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంతో పాటు మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో హైదరాబాద్ సచివాలయంలో తొలుత ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లు, ఆసుపత్రులు, ఎమ్మార్వో కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో సుమారు 300 చోట్ల మహిళా సంఘాల ఆధ్వర్యంలో క్యాంటీన్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం రెండు విడతల్లో 8 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం -- మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం ఇందిరమ్మ మహిళా డెయిరీతో మహిళలకు ఆర్థిక స్వావలంబన: ఎంపీ డాక్టర్ కడియం కావ్య రాష్ట్రంలో ఏ ఒక్క పేద కుటుంబం, దివ్యాంగుడు, వితంతువు, ఒంటరి మహిళ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.
ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
గత ప్రభుత్వం రాష్ట్రంపై సుమారు రూ.8 లక్షల కోట్ల అప్పుల భారం మోపినప్పటికీ ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు.
రెండు విడతల్లో రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కోటి 10 లక్షల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తూ ఇందుకోసం రూ.13,500 కోట్లు వెచ్చిస్తోందని పేర్కొన్నారు.
రైతు రుణమాఫీ, రైతు బీమా, వ్యవసాయానికి, గృహాలకు ఉచిత విద్యుత్ అందించడం కోసం ప్రభుత్వం రూ.18 వేల కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించేందుకు రాష్ట్ర బడ్జెట్‌లో దాదాపు లక్ష కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు వివరించారు.
మహిళా డెయిరీతో పరకాలకు ప్రత్యేక గుర్తింపు
పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రత్యేక చొరవతో సుమారు 15 వేల మంది మహిళలను భాగస్వాములుగా చేస్తూ ఇందిరమ్మ మహిళా శక్తి డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీ వెల్లడించారు.
ముల్కనూరు పాల ఉత్పత్తుల రంగంలో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విధంగా పరకాల మహిళా డెయిరీ కూడా భవిష్యత్తులో గొప్ప సంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు.
ఈ సంస్థ అభివృద్ధికి తన వంతుగా ఎంపీ నిధుల నుంచి కోటి రూపాయల వరకు కేటాయించినట్లు తెలిపారు. మహిళలు కేవలం కుటుంబ బాధ్యతలకే పరిమితం కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధి ద్వారానే సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను గుర్తుచేస్తూ మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు.
ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా, ప్రజలకు ఇచ్చిన హామీలను కార్యరూపంలో అమలు చేస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు మహిళలు, పేదలు, బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.
మహిళలే యజమానులుగా రాష్ట్రంలోనే ఆదర్శ డెయిరీగా పరకాల ఇందిరా మహిళా డైరీ ని తీర్చిదిద్దుతాం
డెయిరీ ప్లాంట్‌కు రూ.32 కోట్లు, 10 ఎకరాల భూమి కేటాయింపు
పరకాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తున్న ప్రభుత్వం: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ మహిళా డెయిరీ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధి, మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.
వరంగల్ జిల్లాలో 12,578 మందికి కొత్తగా చేయూత పింఛన్ల కు గాను రూ.2.93 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతా లో జమ కానుందని వారు పేర్కొన్నారు. డెయిరీ ఏర్పాటుకు 2024 డిసెంబర్‌లో ఆలోచన చేసి కార్యాచరణ ప్రారంభించామని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, డీఆర్డీఏ, సెర్ప్ అధికారులు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో, మంత్రి సీతక్క సూచనలు, సహకారంతో ఈ ప్రాజెక్టును దశలవారీగా ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.
డెయిరీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.32 కోట్లు కేటాయించడంతో పాటు 10 ఎకరాల విలువైన భూమిని ఉచితంగా కేటాయించిందని తెలిపారు. మొత్తం సుమారు రూ.52 కోట్ల విలువైన ఆస్తిని మహిళా సంఘాలకు అందించడం గొప్ప విషయమన్నారు. ఈ డెయిరీకి మహిళా సంఘాల సభ్యులే యజమానులని, బయటి వ్యక్తులకు యాజమాన్య హక్కులు ఉండవని స్పష్టం చేశారు. త్వరలోనే ప్లాంట్‌ను ప్రారంభించి పాల ఉత్పత్తుల రంగంలో మహిళలకు పెద్దఎత్తున ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.
నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు
పరకాల నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక సహకారం అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దామెర, నడికూడ మండల పరిషత్ కార్యాలయ భవనాల నిర్మాణానికి చెరో రూ.2 కోట్లు మొత్తం 4 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వీబీజీ రామ్ జీ పథకం కింద రూ.2.65 కోట్లతో 53 పాల సేకరణ కేంద్రాల నిర్మాణానికి అనుమతులు లభించాయని, వాటికి శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో 41.44 కిలోమీటర్ల మేర నూావీ రహదారుల అభివృద్ధికి రూ.34.80 కోట్లు మంజూరు చేసినందుకు మంత్రి సీతక్కకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
దెబ్బతిన్న ట్యాంకుల తొలగింపునకు అనుమతివ్వాలి
నియోజకవర్గ పరిధిలో ఐదు నుంచి ఏడు వరకు ప్రమాదకర స్థితిలో ఉన్న పాత ట్యాంకులు ఉన్నాయని, వాటిని తొలగించేందుకు అనుమతులు మంజూరు చేయాలని మంత్రి సీతక్కను ఎమ్మెల్యే కోరారు.
సంబంధిత అధికారుల ద్వారా పరిశీలన చేయించి, నష్టస్థితి ధ్రువీకరణ పత్రాలతో ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. అలాగే ఎంపీ డాక్టర్ కడియం కావ్య మహిళల అభ్యున్నతికి, నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా సహకరిస్తున్నారని ఎమ్మెల్యే ప్రశంసించారు.
గీసుగొండ, పరకాల మండల మహిళా సంఘాలకు రూ.20 లక్షల చొప్పున, పెద్దాపురం మహిళా సంఘానికి రూ.20 లక్షలు, ఇందిరమ్మ మహిళా డెయిరీకి రూ.కోటి ఎంపీ నిధులు అందించడం అభినందనీయమన్నారు.
కీర్తినగర్ ప్రాంతానికి చెందిన కలావతి ఆధ్వర్యంలోని 106 మంది మహిళల బృందం సేంద్రియ ఎరువుల తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. చేపల వ్యర్థాలు, రొయ్యల వ్యర్థాలు తదితర పదార్థాలతో సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న ఈ మహిళా బృందం కార్యక్రమాన్ని పరకాల నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ యూనిట్ అభివృద్ధి కోసం భూమి కేటాయింపునకు జిల్లా కలెక్టర్ స్థాయిలో సానుకూలత లభించిందని ఆయన తెలిపారు.
వరంగల్ జిల్లాలో మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మహిళా డెయిరీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: కలెక్టర్ డాక్టర్ సత్య శారద
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరకాల నియోజకవర్గ పరిధిలోని గీసుగొండ, పరకాల మండలాల్లో మహిళా డెయిరీ అభివృద్ధికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మొత్తం 53 పాల సేకరణ కేంద్రాలకు వీబీజీ రాంజీ పథకం కింద శంకుస్థాపన చేసినట్లు తెలిపారు.
అదేవిధంగా కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో స్టిచ్చింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు అందించాల్సిన ఇతర ఉపాధి, అభివృద్ధి కార్యక్రమాలను కూడా క్షేత్రస్థాయిలోలు చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఏదేని కారణం చేత పెన్షన్లు మంజూరు అవని లబ్ధిదారులు అట్టి అంశం పై అధికారులు మరోసారి పరిశీలించి అర్హులైన వారికి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు వైవి గణేష్డిఆర్డిఓ నాగపద్మజా,జడ్పీ సీఈవో వసంత, సంబధిత మండలాల తహసీల్దార్లు, సర్పంచ్ లు, నూతన్ పింఛను లబ్ధిదారుతో పాటు ప్రజా ప్రతినిధులు ప్రజలు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు

జనగామ జిల్లాలో ఘనంగా 32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ (NCSC) - 2026 ప్రదర్శన



మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జనగామ, నవంబర్ 18 : జనగామ జిల్లాలో 32వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ (NCSC) – 2026 కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా మరియు విజయవంతంగా నిర్వహించబడింది. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకకు విద్యార్థుల నుండి అపూర్వ స్పందన లభించింది.
– కార్యక్రమ ముఖ్యాంశాలు:
– మొత్తం ప్రాజెక్టులు: 83
– రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులు: 4
– రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రయోగాలు/విద్యార్థులు:
1. J.సాత్విక ZPHS సింగరాజుపల్లి
2. G.Saketh TGMS కొడకండ్ల
3. MT.Achyuth ZPHS Malkapur
4. R. Shanvi Carmel Convent High School Palakurthy

కలెక్టర్ గారి ఆదేశాల మేరకు విజయవంతం:
జిల్లా కలెక్టర్ గారి ప్రత్యేక ఆదేశాలు, మార్గదర్శకాల అనుగుణంగా ఈ సైన్స్ కాంగ్రెస్ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయినట్లు జిల్లా సైన్స్ ఆఫీసర్ (ఇూా) శ్రీ జన ఉపేందర్ గారు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు మరియు వారికి మార్గదర్శనం చేసిన గైడ్ టీచర్లకు ఆయన ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.
?ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏడీ (ఇూణ) శ్రీ బొమ్మనబోయిన శ్రీనివాస్ గారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ముఖ్య అతిథి గా జమీా .యాదగిరి గారి పాల్గొని విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక రంగాలలో అభిలాష పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెల్పారు.విద్యార్థులలో శాస్త్రీయ పరిశోధనా భావనను మెచ్చుకుంటూ, రాష్ట్ర స్థాయి పోటీలకు సంబంధించిన తేదీలను త్వరలోనే అధికారికంగా తెలియజేస్తామని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై సమరశంఖం పూరించాలి.

-అన్నదాతల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.

-420 హామీల పేరుతో కాంగ్రెస్ మోసం.. గ్రామస్థాయి నుండి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి. గంట రవికుమార్ మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పిలుపు

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





-వర్ధన్నపేటలో పడకేసిన అభివృద్ధి.. ఎన్నికల హామీలు గాలికొదిలేసి... వర్ధన్నపేట ప్రజలను విస్మరించిన ఎమ్మెల్యే...
-బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర సహ సంఘటన మంత్రి దశరథ జీ, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పిలుపు.
-గ్రామ, బూత్ స్థాయిలో బీజేపీని మరింత బలోపేతం చేయాలి.
వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం ఇల్లందలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సమావేశం ఈరోజు మండల అధ్యక్షులు అడుప రాజు గారి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ గారు, రాష్ట్ర సహ సంఘటన మంత్రి దశరథ జీ, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ గార్లు విచ్చేసి దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కార్యవర్గ సమావేశం ప్రధాన ఎజెండాను, భవిష్యత్ కార్యాచరణ మరియు పార్టీని క్షేత్రస్థాయిలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి గ్రామంలో, ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో కమిటీలను మరింత బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.
-ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం అందిస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని కోరారు. ముఖ్యంగా అన్నదాతలకు మోదీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పంటల బీమా, ఎరువులపై భారీ సబ్సిడీ వంటి పథకాల ద్వారా రైతులకు అందిస్తున్న ఆర్థిక భరోసాను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.
-వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో స్థానిక ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు గారు పూర్తిగా విఫలమయ్యారని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో ఆశలు చూపి ఓట్లు వేయించుకున్న ఎమ్మెల్యే, గెలిచిన తర్వాత నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని మండిపడ్డారు. గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతుల లేమి, రైతుల ఇబ్బందులను పరిష్కరించడంలో ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.
-రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తూ అరగోస పెడుతోందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, ఇతర సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని అన్నారు.
-గ్రామస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ శ్రేణులు ముందుండి నిరంతరం పోరాడాలని కోరారు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.
ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రాయబారపు కుమారస్వామి, మిట్టపల్లి కపిల్ కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు రాముండ్ల బాబూరావు, ఉసిల్ల దయాకర్, నాంపల్లి యాకయ్య, మైసా రాము, మాజీ సర్పంచ్ సాయిలు మరియు మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చార్మినార్ ఎక్స్ ప్రెస్ కింద పడి ఆత్మహత్య.

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



వరంగల్ –చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి ట్రైన్ నెంబర్ 12760 చార్మినార్ ఎక్స్ప్రెస్ రైలు కిందపడి గీసుకొండ మండలం వంచనగిరి గ్రామానికి చెందిన మోర్తాల యుగేందర్ (43) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ రైల్వే జి ఆర్ పి సి ఐ నరేష్ కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి బుధవారం శవపరీక్ష అనంతరం ముత్తుని కుమారుడు సాయికుమార్ మృతదేహాన్ని అప్పగించినట్లు సిఐ తెలిపారు.

సనాతన ధర్మాన్ని విస్తరింప చేద్దాం..

– ధర్మ ప్రచార మండలి గౌరవాధ్యక్షులు గిరిజ మనోహర్ బాబు..

పిలుపు.



ధర్మ ప్రచార మండలి నూతన సభ్యులుగా ప్రమాణ స్వీకారం..

మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

భారతీయ సంస్కృతిలో ప్రధానమైన సనాతన ధర్మాన్ని విస్తరింప చేసేందుకు కంకణ భద్దులం కావాలని.. ధర్మ ప్రచారమండలి హనుమకొండ జిల్లా అధ్యక్షులు ప్రముఖ రచయిత సాహితీవేత్త గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు పిలుపునిచ్చారు. హనుమకొండ లోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణమండపంలో బుధవారం టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ కు అనుబంధంగా ఏర్పాటైన ధర్మ ప్రచారమండలి నూతన గౌరవ అధ్యక్షులుగా ఆయన ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రజల్లో ధార్మిక విలువలు, ఆలయాల ఔన్నత్యం ,భక్తి విశ్వాసాల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. ఇందులో భాగంగా ధర్మ ప్రచారమండలని విస్తరింపజేసి 16 మంది సభ్యులకు అవకాశం కల్పించడం ఎంతైనా అభినందనీయమని చెప్పారు.

నూతన అధ్యక్షునిగా ఎన్నికైన ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు గట్టు మహేష్ బాబు మాట్లాడుతూ టీటీడీ చేపట్టే కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ధార్మిక విలువలను పెంపొందింప చేసేందుకు శక్తివంతం లేకుండా కృషి చేస్తామన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సమన్వయకులు రామిరెడ్డి కృష్ణమూర్తి స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా నేలకొండ భాస్కరరావు ప్రధాన కార్యదర్శిగా తిరునగరి నరేందర్ సహాయ కార్యదర్శిగా కనపర్తి రఘువీర్, కోశాధికారిగా గంటా దేవేందర్ రెడ్డిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఎస్ వి బి సి పూర్వ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి పివి మదన్మోహన్ ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని సభ్యులందరిచే ప్రమాణ స్వీకారం చేయించారు.. సభ్యులు వీరే..

ధర్మపురి వెంకటరామ నరసయ్య విష్ణుదాస్ మహీధర్ రావు కోడెం శ్రీనివాస్ నాగబండి శివప్రసాద్ కంచ అశోక్ కుమార్ మందాటి రాజు డాక్టర్ గోకారపు రాము , కుంభం రాజు, మహేశ్వరపు రాజు లక్ష్మణరావు సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు.

మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది లతీఫ్ భట్ హతం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద వ్యతిరేక పోరులో భద్రతా బలగాలు కీలక విజయాన్ని సాధించాయి. లష్కరే తయ్యిబాకు చెందిన మోస్ట్ వాంటెడ్ కమాండర్ లతీఫ్ భట్‌ను భద్రతా దళాలు హతమార్చాయి. కశ్మీర్‌లో క్రియాశీలంగా ఉన్న చివరి స్థానిక లష్కరే తయ్యిబా ఉగ్రవాదిగా భావిస్తున్న అతడి కోసం భద్రతా సంస్థలు కొంతకాలంగా గాలిస్తున్నాయి. ఇటీవల కుల్గాం జిల్లాలో సీఆర్‌పీఎఫ్ సిబ్బందిపై జరిగిన కాల్పుల ఘటనలో అతడి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన భద్రతా బలగాలు అతడి ఆచూకీని గుర్తించి మట్టుబెట్టాయి.

మసీదులో తలదాచుకున్న ఉగ్రవాది

లతీఫ్ భట్ భద్రతా బలగాల నుంచి తప్పించుకునే క్రమంలో ఓ మసీదులోకి ప్రవేశించినట్లు పోలీసులు వెల్లడించారు. అతడిని బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు తొలుత లొంగుబాటుకు అవకాశం కల్పించారు. వీడియో కాల్ ద్వారా సంప్రదించి ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోవాలని కోరారు. లొంగిపోతే ఎలాంటి హాని జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే అధికారుల విజ్ఞప్తిని అతడు తిరస్కరించడంతో భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగించాయి. చివరకు అతడిని హతమార్చాయి. ఈ ఘటనలో మసీదుకు ఎలాంటి నష్టం జరగలేదని పోలీసులు స్పష్టం చేశారు.

నవంబర్ 16న తప్పించుకుని.. చివరకు హతం

కుల్గాం జిల్లాలోని లారూ ప్రాంతంలో నవంబర్ 16న భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో లతీఫ్ భట్ బుల్లెట్ గాయాలతో తప్పించుకున్నట్లు సమాచారం. ఇదే ఆపరేషన్‌లో మరో ఉగ్రవాది ఉమర్ నాసిర్ దార్ హతమయ్యాడు. దీంతో లతీఫ్ కోసం భద్రతా బలగాలు గాలింపును మరింత ముమ్మరం చేశాయి. సైన్యం, సీఆర్‌పీఎఫ్, స్థానిక పోలీసులు సంయుక్తంగా అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. చివరకు అతడి కదలికలను గుర్తించి చుట్టుముట్టాయి.

అమిత్ షా ప్రశంసలు

ఈ ఆపరేషన్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా హర్షం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్ పోలీసులు, భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్ బలగాలు అత్యున్నత సమన్వయంతో ఆపరేషన్ నిర్వహించాయని ప్రశంసించారు. దేశ భద్రత కోసం ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లకు దేశం వందనం చేస్తోందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ జి.పి. సింగ్ కూడా భద్రతా బలగాలను అభినందించారు. ఈ ఆపరేషన్ 2026లో కీలక విజయాల్లో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సీజేఐపై అనుచిత వ్యాఖ్యలు..

న్యాయవాదికి సుప్రీంకోర్టు ధిక్కరణ నోటీసులు

న్యూఢిల్లీ: భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన న్యాయవాదికి సుప్రీంకోర్టు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌బీఏ) దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. సదరు న్యాయవాది వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను 2027 జనవరి 20కు వాయిదా వేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. పిటిషన్‌తో పాటు అటార్నీ జనరల్ ఇచ్చిన సమ్మతిని కూడా పరిశీలించినట్లు తెలిపింది. కోర్టు ధిక్కరణ చట్టంలోని సెక్షన్ 15(1)(బి) ప్రకారం అటార్నీ జనరల్ అనుమతి లభించిన నేపథ్యంలో.. సంబంధిత న్యాయవాదిపై ధిక్కరణ చర్యలు ప్రారంభించేందుకు ఎస్‌బీఏ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. ఈ మేరకు నోటీసులు జారీ చేసింది.

సంక్షేమంలో మహిళలకు అగ్రస్థానం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య







మన మీ వార్త నవంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, కుడా చైర్‌పర్సన్ శ్రీమతి గుండు సుధారాణి,జిడబ్ల్యూఎంసి కమిషనర్ వెంకన్న, తదితరులు హనుమకొండ:నవంబర్ 18 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమంలో మహిళలకు అగ్రస్థానం కల్పిస్తుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు.

బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని కాళోజి కళాక్షేత్రంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, తదితరులు హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన తో కార్యక్రమాన్ని ప్రారంభించి... రాష్ట్ర గీతాన్ని ఆలపించారు

అనంతరం

లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళల సాధికారత సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. మహిళల అభ్యున్నతికి చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సానుకూల మార్పులు తీసుకొస్తుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ చేయూత పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ఈ సమావేశంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ

గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రజాప్రతినిధుల చుట్టూ, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి అధికార యంత్రాంగమే నేరుగా వారి ఇళ్లకు వెళ్లి పెన్షన్లు మంజూరు చేసే విధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు.

నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఒకే రోజు 2,698 మందికి పెన్షన్ల మంజూరు పత్రాలు అందించడం ప్రజాపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలు, బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా రూపొందించబడ్డాయని ఎమ్మెల్యే వివరించారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు, ఇతర సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరుస్తున్నామని చెప్పారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికే 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అర్హులైన మిగతా లబ్ధిదారులకు కూడా దశలవారీగా ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఒకేసారి మంజూరు చేయడం సాధ్యం కాదని, అర్హత ఆధారంగా విడతలవారీగా అందిస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల స్థలం ఉన్న అర్హులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించే విధానాన్ని కూడా వివరించారు. పేదల గృహ అవసరాలను తీర్చేందుకు కొత్తగా టవర్స్ నిర్మాణానికి కూడా చర్యలు చేపట్టామని తెలిపారు.

పెన్షన్ల మంజూరులో ఎలాంటి రాజకీయ వివక్షకు తావులేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. లబ్ధిదారుల నుంచి పెన్షన్లు లేదా ఇతర సంక్షేమ పథకాల మంజూరు కోసం ఎవరైనా ఒక్క రూపాయి డిమాండ్ చేసినా సహించేది లేదని హెచ్చరించారు. దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హులైన ప్రజలకు చేరాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన క్యాంపు కార్యాలయానికి లేదా స్థానిక ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఇప్పటికే పెన్షన్లు మంజూరైన వారితో పాటు ఇంకా అర్హత ఉండి పెన్షన్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, క్యాంపు కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం లేదా మున్సిపల్ అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకువస్తే పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండు మూడు రోజులు ఆలస్యమైనా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యత తనదేనని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ .. కాళోజి కళాక్షేత్రంలో చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం... వేలాదిగా వచ్చిన లబ్ధిదారులతో ఒక పండగ వాతావరణంలా కనిపిస్తుందన్నారు

కలెక్టరేట్ లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల కోసం అనేక దరఖాస్తులు వస్తుంటాయని పేర్కొన్నారు.

వారందరికీ పింఛన్లు మంజూరు అవుతుండడంతో లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు.

ప్రభుత్వం అందించే పింఛన్లు కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో సహాయకరంగా నిలుస్తుందన్నారు.

కుడా చైర్‌పర్సన్ శ్రీమతి గుండు సుధారాణి మాట్లాడుతూ... దాదాపు పదేళ్లుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు నేడు పెన్షన్లు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ఆరు గ్యారంటీలను దశలవారీగా అమలు చేస్తోందన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు కాలనీల్లో మౌలిక వసతులు, మురికివాడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు అందించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ, ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి. అజీజ్ ఖాన్,ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, డిప్యూటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ ఇతర అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఆధునిక సాంకేతికత వినియోగం

– డ్రోన్ల ద్వారా క్రిమిసంహారక మందుల పిచికారీ ప్రారంభించిన కమిషనర్ టి. వెంకన్న

మన మీ వార్త నరంబర్ 18 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

నగరంలోని 66 డివిజన్లలో దశలవారీగా ప్రత్యేక కార్యాచరణ జిడబ్ల్యూఎంసి , నవంబర్ 18:
గ్రేటర్ వరంగల్ నగరంలో దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటోంది. ఇందులో భాగంగా దోమల ఉత్పత్తికి ప్రధాన కేంద్రాలుగా ఉన్న నాలాలు, మురుగునీటి ప్రవాహ ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా క్రిమిసంహారక మందుల పిచికారీ కార్యక్రమాన్ని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న బుధవారం నయీంనగర్‌లోని రాజాజీ నాలా వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా డ్రోన్ల ద్వారా జరుగుతున్న మందుల పిచికారీ ప్రక్రియను కమిషనర్ పరిశీలించారు. సాధారణంగా పారిశుద్ధ్య సిబ్బంది నేరుగా చేరుకోలేని నాలాల్లోని లోతైన ప్రాంతాలు, నీరు నిల్వ ఉండే





ప్రదేశాలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో సులభంగా క్రిమిసంహారక మందులను పిచికారీ చేయవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో తక్కువ సమయంలో విస్తృత ప్రాంతాల్లో మందుల పిచికారీ చేపట్టడంతో పాటు దోమల ఉత్పత్తిని సమర్థవంతంగా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

నగరంలోని 66 డివిజన్ల పరిధిలో దశలవారీగా, ప్రణాళికాబద్ధంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. మలేరియా, డెంగ్యూ వంటి దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను నివారించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని, దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నివారణ చర్యలను సమన్వయంతో మరింత పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, అర్బన్ మలేరియా అధికారి రజిని, సూపర్‌వైజర్ అనిల్, హెల్త్ అసిస్టెంట్లు, మలేరియా విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి పుట్టినరోజున సేవా స్ఫూర్తి.. విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ!



నేరడిగొండ : 'చేయూత ఫౌండేషన్' చైర్మన్ ఎన్.టి. రమణ తన కుమారుడు జాన్ పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుమారి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. విద్య ద్వారానే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థులంతా క్రమశిక్షణ తో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించా రు. జన్మదిన వేడుకలను కేవలం వ్యక్తిగత సంబరాలకే పరిమితం చేయకుండా, పేద విద్యార్థులకు ఉపయోగపడేలా సేవా కార్యక్ర మం నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగారాం, శివలీల తదితరులు జాన్ పాల్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో ఉన్నత ఆశయాలతో మరింత అభివృద్ధి సాధించాలని దీవించారు.

అర్హా కుటుంబాలన్నింటికీ బీమా భద్రత

-మొదటిపేజీ తరువాయి

అమలుకు అవసరమైన ఏర్పాట్లు, లబ్ధిదారుల గుర్తింపు, నమోదు ప్రక్రియ, ప్రచారం తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అర్హులైన కుటుంబాలు ఎవరూ పథకం పరిధి నుంచి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలు

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం వివరాలను నమోదు చేసేందుకు గ్రామ పంచాయతీల్లో, పట్టణ ప్రాంతాల్లోని మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునేలా ఈ కేంద్రాలు పనిచేయనున్నాయి. వీటితో పాటు ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ విధానంలోనూ నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నారు. దీనివల్ల ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గడంతో పాటు నమోదు ప్రక్రియ వేగవంతం కానుంది.

రూ.2 లక్షల బీమా నుంచి రూ.5 లక్షలకు పెంపు

ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా వేర్వేరుగా అమలవుతున్న జీవిత బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా నేత, గౌడ, కార్మిక, మత్స్యకార వర్గాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.2 లక్షల జీవిత బీమా మొత్తాన్ని ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం పరిధిలో రూ.5 లక్షలకు పెంచనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఈ నిర్ణయంతో ఆయా వృత్తులపై ఆధారపడే కుటుంబాలకు మరింత ఆర్థిక భరోసా లభించనుంది.



నెల రోజుల పాటు నమోదు ప్రక్రియ

ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం నమోదు కార్యక్రమం సుమారు నెల రోజుల పాటు కొనసాగనుంది. ఈ వ్యవధిలో అర్హులైన కుటుంబాలన్నింటినీ గుర్తించి వారి వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సీఎస్ సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశం

పథకం ప్రయోజనాలు, నమోదు విధానం, అర్హతలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక నమోదు కేంద్రాల ద్వారా సహకారం అందించాలని స్పష్టం చేశారు.

పారదర్శకతకు ప్రాధాన్యం

నమోదు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్థంగా జరగాలని సీఎస్ పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ శాఖల పరిధిలో ఉన్న బీమా పథకాల వివరాలను సమీకరించి, ఇందిరమ్మ కుటుంబ బీమా పరిధిలోకి తీసుకొచ్చే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా బీమా రక్షణ కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం పేర్కొంటోంది. రూ.5 లక్షల జీవిత బీమా రక్షణతో అర్హ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. పథకం విజయవంతంగా అమలైతే రాష్ట్రంలోని అనేక కుటుంబాలకు భరోసా లభించే అవకాశం ఉంది.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో నమోదు ప్రక్రియ కీలకంగా మారనుంది. ప్రత్యేక యాప్, ఆన్‌లైన్ సదుపాయాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో నమోదు కేంద్రాల ఏర్పాటు ద్వారా అర్హులందరికీ పథకం చేరువ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

కృష్ణా జలాలపై బీఆర్ఎస్‌ది తప్పుడు ప్రచారం

-మొదటిపేజీ తరువాయి

నీటిని వినియోగించుకుందని వివరించారు. కృష్ణా జలాల అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ తప్పుడు సమాచారం అందిస్తూ గందరగోళం సృష్టిస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ హయాంలో ఏపీకే అధిక నీటి వినియోగం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కృష్ణా నది నుంచి ఆంధ్రప్రదేశ్ 4,460 టీఎంసీల నీటిని తరలించగా, తెలంగాణ 1,993 టీఎంసీలను మాత్రమే వినియోగించుకుందని మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతి కాలంలో ఏపీ 98.16 టీఎంసీల నీటిని తరలించగా, తెలంగాణ 122.74 టీఎంసీలను వినియోగించుకుందని వివరించారు. ఈ లెక్కల ప్రకారం ఏపీ కంటే తెలంగాణ 24 టీఎంసీలకు పైగా నీటిని అధికంగా వినియోగించుకుందని తెలిపారు.

ఏపీ 1.8 టీఎంసీల తరలింపు పనులకు వ్యతిరేకం

కేంద్ర జల్ జీవన్ మిషన్ తాగునీటి పథకం కింద ఆంధ్రప్రదేశ్ 1.8 టీఎంసీల నీటిని తరలించే పనులకు



శ్రీకారం చుట్టిందని ఉత్తమ్ వెల్లడించారు. ఈ పనులను తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి తమ అభ్యంతరాలను తెలియజేశామని చెప్పారు. ఆ పనులు నిలిపివేయించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నామని స్పష్టం చేశారు.

ఏపీ నేతలతో లాలూచీ పడే ప్రసక్తే లేదు

తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో తమ ప్రభుత్వం రాజీపడబోదని ఉత్తమ్ అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పార్టీలతో, నాయకులతో లాలూచీ పడిందని విమర్శించారు. తాము మాత్రం రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. నీటి వినియోగానికి సంబంధించిన వాస్తవ గణాంకాలను ప్రజల ముందుంచుతున్నామని, బీఆర్ఎస్ ఇకనైనా దుష్ప్రచారం ఆపాలని హితవు పలికారు.

సోనియా వల్లే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు

సోనియా గాంధీ ఆత్మకథపై కేటీఆర్ చేసిన విమర్శలపైనా ఉత్తమ్ స్పందించారు. సోనియా గాంధీ చొరవ లేకపోతే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగేది కాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ మనసులో ఉండటం వల్లే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు మార్గం సుగమమైందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతలు అనుభవిస్తున్న పదవులు, ఆస్తులు, సంపదకు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా ఒక కారణమని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పాటులో సోనియా పాత్రను స్వయంగా కేసీఆర్ అసెంబ్లీలో ప్రస్తావించారని ఉత్తమ్ గుర్తుచేశారు.

నీటి అంశంపై రాజకీయ వాగ్వాదం

కృష్ణా జలాల వినియోగం, ఆంధ్రప్రదేశ్ చేపట్టిన నీటి తరలింపు పనులు, తెలంగాణ హక్కుల అంశాలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వాగ్వాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చకు దారితీశాయి.

ఏపీలో లేని క్రాప్ హాలిడే తెలంగాణకు ఎందుకు?

-మొదటిపేజీ తరువాయి

శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నాగార్జునసాగర్ నుంచి 90 టీఎంసీల తరలింపా?

నాగార్జునసాగర్ నుంచి సుమారు 90 టీఎంసీల కృష్ణా జలాలను తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. విజయపురి సౌత్ సమీపంలో సొరంగం, నీటి మళ్లింపు వ్యవస్థ నిర్మాణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి పథకంగా చెబుతున్నప్పటికీ, నిర్మాణాల పరిమాణం, నీటి తరలింపు సామర్థ్యంపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. సుమారు 1,658 కిలోమీటర్ల పైపులైన్ వ్యవస్థ, 510 అడుగుల స్థాయి వద్ద నీటి తీసుకునే ఏర్పాట్లపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు.

సాగర్‌లో నీటి మట్టం తగ్గిన పరిస్థితుల్లోనూ నీటిని తీసుకెళ్లే అవకాశం ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్మాణాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ), కేంద్ర ప్రభుత్వం లేదా ఇతర సంబంధిత సంస్థల అనుమతులు ఉన్నాయా? అని ప్రశ్నించారు.

తెలంగాణ ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదా?

ఆంధ్రప్రదేశ్ నీటిని తరలించే ప్రయత్నాలను అడ్డుకోవడంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. అక్టోబర్‌కు ముందే ఈ అంశంపై ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేసిందా? మిగిలిన నీటిని తాగునీటి అవసరాలకు కేటాయించాలని కోరిందా? అనే విషయాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్‌తో పాటు నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల తాగునీటి అవసరాలకు కృష్ణా జలాల్లో ఎంత కేటాయించారో వెల్లడించాలని కోరారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఎంత నీటిని నిల్వ ఉంచుతున్నారో ప్రజలకు తెలియజేయాలని అన్నారు.

ఏపీలో సాగు.. తెలంగాణలో క్రాప్ హాలిడే ఎందుకు?

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో ఆంధ్రప్రదేశ్ రైతులు పంటలు సాగు చేస్తుండగా, తెలంగాణ వైపు ఎడమ కాలువ పరిధిలో క్రాప్ హాలిడే పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయని కేటీఆర్ ప్రశ్నించారు. ఒకే ప్రాజెక్టు పరిధిలో రెండు రాష్ట్రాల్లో భిన్నమైన పరిస్థితులు ఉండటానికి కారణమేంటని నిలదీశారు. సాగర్ నుంచి నీటిని తరలిస్తుంటే నల్గొండ జిల్లాకు చెందిన మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం



విఫలమైందని, నీటి కొరత కారణంగా రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ అంశంపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

పాలమూరుకు బీఆర్ఎస్ హయాంలో 8 లక్షల ఎకరాలకు నీళ్లు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతంలో కరవు, వలసలు ప్రధాన సమస్యలుగా ఉండేవని కేటీఆర్ గుర్తుచేశారు. కృష్ణా నది జిల్లాలో సుమారు 300 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నప్పటికీ సాగునీటి ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, జూరాల, తుమ్మిళ్ల వంటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేసిందని చెప్పారు. కేసీఆర్ హయాంలో పాలమూరు ప్రాంతంలో సుమారు 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా కూలీలు పాలమూరుకు వచ్చి పనులు చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

తుమ్మిళ్లతో ఆర్డీఎస్‌కు రక్షణ

రాజోలిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) పరిధిలోని ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసిందని కేటీఆర్ తెలిపారు. గతంలో పెండింగ్‌లో ఉన్న పలు సాగునీటి ప్రాజెక్టులను తమ ప్రభుత్వం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చిందన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకునేందుకు కాంగ్రెస్ నేతలు కోర్టుల్లో కేసులు వేశారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందే అవకాశం ఉందని పేర్కొన్నారు.

బీజేపీ ఎంపీలు ఏం చేస్తున్నారు?

తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్ర నీటి హక్కుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం లేదని కేటీఆర్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ చేపడుతున్నట్లు ఆరోపిస్తున్న నీటి తరలింపు పనులపై కేంద్రం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీ ద్వారా సంబంధిత నిర్మాణాలపై సమీక్ష జరిపించి, అనుమతుల వివరాలను వెల్లడించాలని కోరారు.

కేఆర్ఎంబీకి లేఖ.. అవసరమైతే న్యాయపోరాటం

ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న నీటి తరలింపు ప్రయత్నాలను నిలిపివేయాలని కోరుతూ బీఆర్ఎస్ తరఫున కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు లేఖ రాయనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో తమ పార్టీ రాజీపడబోదని అన్నారు.

నల్గొండ, పాలమూరులో ప్రజా ఉద్యమం

కృష్ణా జలాల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. రైతులు, ప్రజలను చైతన్యపరిచి నీటి హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని చెప్పారు. ఈ అంశంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో చర్చించి తదుపరి కార్యాచరణ రూపొందిస్తామని వెల్లడించారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం..



-మొదటిపేజీ తరువాయి

కారణంగా ముసాయిదా ఓటరు జాబితాలో చోటు దక్కని ఓటర్లకు కూడా మరో అవకాశం కల్పించారు. గైర్హాజరు, వలస వెళ్లినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన (ఏఎస్‌డీఈ) కేటగిరీలోని ఓటర్ల కోసం ప్రత్యేకంగా ఫారాల పంపిణీ, సేకరణ చేపట్టనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నవంబర్ 18లోగా ఫారాలను సిద్ధం చేయాలి. నవంబర్ 18 నుంచి 30 వరకు వాటిని పంపిణీ చేసి, తిరిగి సేకరించాలి. అందిన ఫారాల పరిశీలన, పరిష్కారాన్ని డిసెంబర్ 10లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

తెలంగాణలో 73.39 లక్షల మంది ఏఎస్‌డీఈ కేటగిరీలో

ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందు తెలంగాణ ఓటరు జాబితాలో 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్యుమరేషన్ దశలో 2,64,87,213 మంది ఫారాలు సమర్పించగా.. మిగిలిన 73,39,235 మందిని ఏఎస్‌డీఈ కేటగిరీలో గుర్తించారు. వీరికి సంబంధించి ఫారాల సేకరణ, పరిశీలనకు తాజా షెడ్యూల్‌లో అవకాశం కల్పించారు. మరోవైపు, ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించిన వారిలో వివరాల్లో వ్యత్యాసాలు లేదా 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ సమస్యలు ఉన్నవారికి నోటీసులు జారీ చేశారు. వారిలో చాలామందికి విచారణ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.

ఏడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మార్పులు

తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర, నాగాలాండ్, హరియాణా, జార్ఖండ్‌లలోనూ ఎస్ఐఆర్ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం సవరించింది. ఈ ప్రాంతాల్లో క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి డిసెంబర్ 15ను, తుది ఓటరు జాబితా ప్రచురణకు డిసెంబర్ 22ను గడువుగా నిర్ణయించింది.

బీఎల్ఓను సంప్రదించండి

ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తెలుసుకోవడానికి స్థానిక బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ)ను సంప్రదించవచ్చు. సందేహాలు, సహాయం కోసం 1950 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు. తుది జాబితా ప్రచురణ తర్వాత కూడా అర్హులైన వారు ఓటరు నమోదుకు నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల్లో వేగం.. విదేశీ యంత్రాలతో తవ్వకాలు



నాగర్‌కర్నూల్: శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం తవ్వకం పనులు వేగం పుంజుకున్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో సొరంగంలో జరిగిన ప్రమాదం అనంతరం నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించిన అధికారులు.. రెండో దశ తవ్వకాలను లక్ష్యానికి అనుగుణంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విదేశీ యంత్రాలను వినియోగిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు. ఇప్పటివరకు రెండో దశలో ఇరువైపులా కలిపి 951 మీటర్ల తవ్వకం పూర్తయింది. మరో ఐదు నుంచి ఆరు రోజుల్లో వెయ్యి మీటర్ల మైలురాయిని చేరుకునే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

43.9 కిలోమీటర్ల సొరంగం

ఎస్ఎల్‌బీసీ సొరంగం మొత్తం పొడవు 43.931 కిలోమీటర్లు. ప్రమాదం జరగడానికి ముందే అవుట్‌లెట్ వైపు 20.815 కిలోమీటర్లు, ఇన్‌లెట్ వైపు 13.887 కిలోమీటర్ల మేర తవ్వకాలు పూర్తయ్యాయి. మిగిలిన పనులను పూర్తి చేసేందుకు రెండో దశలో తవ్వకాలను ఈ ఏడాది ఫిబ్రవరి 16న తిరిగి ప్రారంభించారు. ప్రస్తుతం ఇరువైపులా పనులు కొనసాగుతున్నాయి.

తవ్వకాల వేగం పెంపు

రెండో దశ పనులు ప్రారంభమైన తొలినాళ్లలో రోజుకు సగటున 3 నుంచి 6 మీటర్ల వరకు మాత్రమే తవ్వకాలు జరిగాయి. ప్రస్తుతం ఆధునిక యంత్రాల వినియోగంతో రోజుకు 10 నుంచి 14 మీటర్ల వరకు తవ్వకాలు చేపడుతున్నారు. దీంతో కిలోమీటరు తవ్వకం మైలురాయిని త్వరలోనే చేరుకోనున్నారు. అడ్వాన్స్‌డ్ టన్నెలింగ్ మెథడ్ విత్ అబ్జర్వేషన్ టెక్నిక్స్ (ఏటీఎంఓటీ)తో పాటు బ్లాస్టింగ్ పద్ధతిని అనుసరిస్తున్నారు. ఇన్‌లెట్ వైపు తవ్వకాలకు ఆటంకంగా మారిన షియర్ జోన్‌ను కూడా అధిగమించినట్లు అధికారులు వెల్లడించారు.

జపాన్ నుంచి ఆధునిక యంత్రాలు

సొరంగం పనులను వేగవంతం చేసేందుకు జపాన్ నుంచి ప్రత్యేకంగా త్రీ ఆర్మ్ బూమర్ యంత్రాలను దిగుమతి చేసుకున్నారు. ఆగస్టులో తెప్పించిన తొలి యంత్రాన్ని మన్నెవారిపల్లి (అవుట్‌లెట్) వైపు వినియోగిస్తున్నారు. తాజాగా దోమలపెంట (ఇన్‌లెట్) వైపు తవ్వకాల కోసం మరో యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యంత్రానికి హైడ్రాలిక్ వ్యవస్థతో పనిచేసే మూడు యాంత్రిక చేతులు ఉంటాయి. ఇవి రాతి పొరల్లో వేగంగా డ్రిల్లింగ్ చేసేందుకు, బ్లాస్టింగ్‌కు అవసరమైన రంధ్రాలు చేయడానికి ఉపయోగపడతాయి.

శిథిలాల తొలగింపునకు తక్కువ సమయం

గతంలో సుమారు ఆరు మీటర్ల మేర డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పూర్తయ్యాక వెలువడిన రాతి శిథిలాలను తొలగించేందుకు దాదాపు 35 గంటల సమయం పట్టేది. ప్రస్తుతం ఆధునిక ఎలక్ట్రిక్ లోడర్లు, డంపర్ల వినియోగంతో ఈ పనిని 25 గంటల్లోపే పూర్తి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇరువైపులా త్రీ ఆర్మ్ బూమర్లను వినియోగించడం వల్ల డ్రిల్లింగ్ పనుల్లో మరింత వేగం పెరగనుంది.

భద్రతకు ప్రాధాన్యం

సొరంగం పనుల్లో వేగంతో పాటు కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించారు. ప్రమాదం పునరావృతం కాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటూ పనులు కొనసాగించాలని సూచించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఆధునిక యంత్రాలు అందుబాటులోకి రావడంతో తవ్వకాల వేగం పెరిగినా.. భౌగోళిక పరిస్థితులు, రాతి పొరల స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని భద్రతా ప్రమాణాల మేరకు పనులు కొనసాగించాల్సి ఉంది.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512